ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
బుధవారం, 19 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 06 | పేజీలు: 8 వెల: 5



## బిల్డింగ్ పర్మిషన్‌కు రూ.20 వేల లంచం

- ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్


3



## గాయత్రి,శ్రీకాంత్‌లకు అర్జున అవార్డులు

- బ్యాడ్మింటన్‌లో గాయత్రి సత్తా
- పారా షూటింగ్‌లో శ్రీకాంత్ మెరుపులు
- మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులు
- అభినందనలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి, క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి

7



# వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

"ఈసారి పరకాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తా.. డీలిమిటేషన్‌లో రిజర్వేషన్లు మారితే నా సతీమణిని బరిలోకి దింపుతా.. అధిష్ఠానం ఆదేశిస్తే గ్రేటర్ వరంగల్ మేయర్ అభ్యర్థిగానూ పోటీ చేస్తా.. పార్టీ నిర్ణయమే నాకు శిరోధార్యం" అని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. రెండుసార్లు పార్టీ కోసం పరకాల టికెట్‌ను త్యాగం చేశానని, పదేళ్లలో కాంగ్రెస్‌ను సున్నా నుంచి గెలుపు స్థాయికి తీసుకొచ్చామని చెప్పారు. గ్రేటర్ వరంగల్‌లో కాంగ్రెస్ 46 నుంచి 48 డివిజన్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలే తన బలమని, వారే తన సైన్యమని, దసరా నుంచి జిల్లాలో కొత్త కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు. ప్రజా, సామాజిక సేవలోనే తనకు నిజమైన సంతృప్తి ఉందని, ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నానన్నారు. "క్లీన్ అండ్ మెరిట్‌తోనే డీసీసీ అధ్యక్ష పదవి దక్కింది.. నా విజన్ చూసి రాహుల్‌గాంధీ హగ్ ఇచ్చారు" అని చెప్పారు. ఈ దేశానికి కాంగ్రెస్ ఎంతో అవసరమని, పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమన్నారు. హనుమకొండలోని తన నివాసంలో మంగళవారం డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఇనుగాల తన రాజకీయ ప్రస్థానం, వ్యక్తిగత నేపథ్యం, సేవా కార్యక్రమాలు, పరకాలలో కాంగ్రెస్ బలోపేతం, డీసీసీ అధ్యక్షుడిగా చేపడుతున్న కార్యక్రమాలు, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై మాట్లాడారు.

*- కాకతీయ, తెలంగాణ బ్యూరో*

- రిజర్వేషన్లు మారితే నా సతీమణిని పోటీకి నిలుపుతా
- అధిష్ఠానం ఆదేశిస్తే మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగుతా
- ఏదైనా పార్టీ నిర్ణయమే శిరోధార్యంగా భావిస్తా
- గ్రేటర్‌లో గెలవబోయేది కాంగ్రెస్సే.. 46 నుంచి 48 డివిజన్లు గెలుస్తాం
- పదేళ్లలో పరకాలలో పార్టీని సున్నా నుంచి విజయం వరకు తీసుకొచ్చాం
- ప్రజా, సామాజిక సేవతోలనే నాకు సంతృప్తి
- పార్టీ కార్యకర్తలే నా బలం.. వారే నా సైన్యం
- దసరా నుంచి కొత్త కార్యాచరణ అమలు చేస్తాం
- ఎన్టీఆర్‌కు వీరాభిమానాని..ముందు ఎస్ఎఫ్ఐలో పనిచేశా
- ఈ దేశానికి కాంగ్రెస్ ఎంతో అవసరం..
- డీసీసీ అధ్యక్షుడిగా ఎంపికవ్వడానికి క్లీన్ అండ్ మెరిటే కారణం
- నా విజన్ చూసి.. రాహుల్ గాంధీ హగ్ ఇచ్చారు
- హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి

7



## విగ్రహం తొలగించిన చోటే పెట్టాలి

- నోటీసులు లేకుండా తొలగించడం దారుణం
- కలెక్టర్, సీపీకి ముందే సమాచారం ఇచ్చాం
- భూ యజమాని అనుమతితోనే ఏర్పాటు చేశాం
- పెద్ది పేరును మెడికల్ కాలేజీకి పెట్టాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- నర్సంపేట బంద్‌కు పిలుపు



**కాకతీయ, హైదరాబాద్:** నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం దారుణమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. విగ్రహాన్ని తొలగించిన చోటే తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. విగ్రహం తొలగింపు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల అరెస్టులకు నిరసనగా నర్సంపేట బంద్‌కు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహ ఏర్పాటు విషయాన్ని ముందుగానే కలెక్టర్, సీపీకి సమాచారం ఇచ్చామని తెలిపారు. భూ యజమాని విద్యాసాగర్ అనుమతితోనే విగ్రహాన్ని

........(తరువాయి 2లో)



# మిల్లర్ల మాయాజాలం

### రూ.6,631 కోట్ల బకాయిలు!

- ధాన్యం అప్పగిస్తే.. బియ్యం తిరిగి ఇవ్వాల్సిందే
- ఏళ్ల తరబడి పెండింగ్‌లో కస్టమ్ మిల్లింగ్ బియ్యం
- గత ప్రభుత్వాల్లో రూ.4,939 కోట్లు..
- కాంగ్రెస్ హయాంలో మరో రూ.1,692 కోట్లు
- 2,388 మిల్లులపై భారీ బకాయిల భారం
- అక్రమాలపై కేసులు..
- ఆస్తుల జప్తునకు సర్కారు సిద్ధం

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం.. మిల్లులకు చేరిన తర్వాత బియ్యంగా మారి తిరిగి ప్రభుత్వ గోదాములకు చేరాలి. అక్కడి నుంచి ఎఫ్‌సీఐకి చేరితేనే ప్రభుత్వానికి నిధులు తిరిగి సమకూరుతాయి. కానీ కొందరు మిల్లర్ల అక్రమాలతో ఈ వ్యవస్థ గాడి తప్పింది. ప్రభుత్వ ధాన్యం బియ్యంగా మారకుండానే బయట మార్కెట్‌కు తరలిపోతోందన్న ఆరోపణలు, పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ వంటి వ్యవహారాలతో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 2,388 రైస్ మిల్లుల నుంచి రూ.6,631 కోట్ల విలువైన బకాయిలు రావాల్సి ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇందులో గత ప్రభుత్వాల కాలంలో పేరుకుపోయిన బకాయిలు రూ.4,939 కోట్లు కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.1,692 కోట్లు జత కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

**ధాన్యం ప్రభుత్వానిదే.. జాబ్‌వర్క్ మాత్రమే**

ప్రభుత్వం మిల్లర్లకు అప్పగించే ధాన్యంపై వారికి యాజమాన్య హక్కు ఉండదు. ధాన్యాన్ని బియ్యంగా మార్చి నిర్దేశిత గడువులో ప్రభుత్వానికి అప్పగించాలి. ఇందుకు మిల్లింగ్ చార్జీలు చెల్లించడంతోపాటు తౌడు, నూకలు వంటి ఉప ఉత్పత్తులను మిల్లర్లు పొందుతారు. అయితే కొందరు ఈ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

........(తరువాయి 2లో)

## అధికారుల పిల్లలు ప్రభుత్వ బడుల్లోనే చదవాలి

- విద్యాశాఖ అధికారులకు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడి సూచన
- గ్రామీణ విద్యార్థుల కష్టాలు పట్టించుకోవాలి
- మంత్రులు, నేతలు ఒక్కరోజైనా గ్రామీణ బడులకు పిల్లలను పంపాలి
- మద్యం తాగి క్లాసులో నిద్రించిన హెడ్‌మాస్టర్ సస్పెన్షన్
- ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలి
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



2

## సిందూర్‌పై పాక్ సైన్యం ఏడుపు

- భారత్ కథనం ఏకపక్షమంటూ ఆరోపణ
- డాక్యుసిరీస్‌లో వాస్తవాలు వక్రీకరించారంటూ విమర్శలు
- పహల్గామ్ దాడికి భారత్ దీటైన బదులు
- భట్టి నెట్‌వర్క్‌పై 14 రాష్ట్రాల్లో ఉక్కుపాదం
- అమిత్ షా వ్యాఖ్యలపైనా పాక్ అభ్యంతరం
- భారత సైనిక చర్యలతో పాక్ ఉక్కిరిబిక్కిరి



7



## భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఎకరం

- భూమే పేదల ఆత్మగౌరవానికి భరోసా
- రేవంత్ సర్కారుపై తీవ్ర ఆరోపణలు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- 22ఏ నిబంధనపై తీవ్ర విమర్శలు
- భూ పంపిణీపై కొత్త రాజకీయ చర్చ

3



## బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదే


- కేసీఆర్ అప్పులు తెలంగాణకు ముప్పుగా మారాయి
- కుటుంబ పాలనకు చరమగీతం పాడాం
- బహుజనులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాం
- పిల్లల చదువుకు ఎన్ని వందల కోట్లయినా ఖర్చు చేస్తాం
- 2029లో కాంగ్రెస్‌దే అధికారం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** సామాజిక న్యాయం కాంగ్రెస్ పాలనతోనే సాధ్యమవుతుందని, బీసీల జనాభా లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లించగా మిగిలిన నిధులతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. 2029లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కల్వకుంట్ల కుటుంబ పాలనలో కేసీఆర్ ముఖ్యమంత్రి, కేటీఆర్ వర్కింగ్

........(తరువాయి 2లో)

## అర్ధరాత్రి పెద్ది విగ్రహం తొలగింపు

- నర్సంపేటలో హైడ్రామా
- వేకువజామున మూడు గంటలకు అధికారుల చర్య
- భారీ పోలీసు బలగాల మోహరింపు.. గద్దెను సైతం కూల్చివేత
- బీఆర్ఎస్ నేతల గృహనిర్బంధం
- పెద్ది సుదర్శన్‌రెడ్డి భార్య పెద్ది స్వప్న కంటతడి





3

## రాబరీ మినిస్టర్‌గా పొంగులేటి

- లక్షల కోట్ల విలువ చేసే భూములపై దందా
- ఫీనిక్స్ కంపెనీ మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది
- పొంగులేటి ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- తప్పులకు నైతిక బాధ్యత వహించాలి
- భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి
- బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**కాకతీయ, హైదరాబాద్ :** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాబరీ మినిస్టర్‌గా మారారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మంత్రి కాకముందు ఆయన ఆస్తులెంత, ఇప్పుడు ఆస్తులెంత ఉన్నాయో వెల్లడించాలని డిమాండ్

........(తరువాయి 2లో)

# మిల్లర్ల మాయాజాలం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ధాన్యాన్ని బయట మార్కెట్‌కు తరలించడం, పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి సరఫరా చేయడం వంటి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒక సీజన్‌లో మిల్లుకు చేరిన ధాన్యానికి సంబంధించిన బియ్యం మరో సీజన్ వచ్చే వరకు కూడా ప్రభుత్వానికి చేరకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించేందుకు ప్రభుత్వం బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మిల్లర్ల నుంచి రావాల్సిన బియ్యం, దానికి సంబంధించిన నగదు తిరిగి రాకపోవడంతో ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై అదనపు భారం పడుతోంది.



**కేసులు.. అరెస్టులు..**
**అయినా ఆగని అక్రమాలు**

బకాయిల వసూలుతోపాటు అక్రమాలకు పాల్పడుతున్న మిల్లర్లపై ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. పెద్దపల్లి జిల్లాలో రూ.132 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం కాజేసిన వ్యవహారంలో ఓ మిల్లర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఇద్దరు మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ వ్యవహారాల్లో మరో 11 మందిపై చర్యలు తీసుకున్నారు. రూ.20 కోట్ల విలువైన బియ్యం, రూ.17 కోట్ల విలువైన వాహనాలను అధికారులు సీజ్ చేశారు. ధాన్యం అక్రమ రవాణాకు సంబంధించి 348 మంది మిల్లర్లపై క్రిమినల్ కేసులు, 128 మందిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది. అయినప్పటికీ మొత్తం బకాయిల సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించకపోవడం గమనార్హం. కేసులు నమోదైన తర్వాత కోర్టు ప్రక్రియ సుదీర్ఘంగా సాగడం, ఆస్తుల గుర్తింపు, నగదు రికవరీ వంటి అంశాలు ప్రభుత్వానికి సవాల్‌గా మారుతున్నాయి.

**ప్రతి గింజ లెక్క.. ఇక తప్పనిసరి!**

గతంలో మిల్లుల్లో నిల్వలపై పర్యవేక్షణ సరిగా లేకపోవడం వల్లే ఇంత భారీ మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయన్న విమర్శలు ఉన్నాయి. దీనికి ముగింపు పలికేందుకు ప్రభుత్వం ఇప్పుడు మిల్లుల వారీగా నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లలో మిల్లులకు అప్పగించిన ధాన్యం, వాటి నుంచి రావాల్సిన బియ్యం, ఇప్పటికే అందించిన పరిమాణం, మిగిలిన బకాయిలను అధికారులు లెక్కిస్తున్నారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ వ్యవహారంపై సమీక్షలు నిర్వహించి బకాయిలను కచ్చితంగా రాబట్టాలని ఆదేశించారు. కేవలం నోటీసులతో సరిపెట్టకుండా అవసరమైన చోట రెవెన్యూ రికవరీ చట్టం కింద ఆస్తుల జప్తు, వేలం దిశగా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగం భావిస్తోంది.

**రైతు డబ్బుకు.. మిల్లర్ల బకాయికి లింకు**

కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయిల సమస్య కేవలం పౌరసరఫరాల శాఖకు సంబంధించిన వ్యవహారం కాదు. దీని ప్రభావం చివరకు రైతులపైనే పడుతోంది. రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వారికి చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం నిధులు సమకూర్చుకుంటుంది. మరోవైపు మిల్లుల నుంచి రావాల్సిన బియ్యం ఎఫ్‌సీఐకి చేరితేనే ప్రభుత్వానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ముందుకు సాగుతాయి. అందుకే రూ.6,631 కోట్ల బకాయిలను పూర్తిగా రికవరీ చేయడం ప్రభుత్వానికి కీలక పరీక్షగా మారింది. ప్రతి మిల్లులో వాస్తవంగా ఉన్న నిల్వ ఎంత? బయటకు వెళ్లిన ధాన్యం ఎంత? ప్రభుత్వానికి తిరిగి వచ్చిన బియ్యం ఎంత? ఇంకా రావాల్సింది ఎంత? అన్నదానిపై పూర్తిస్థాయిలో డిజిటల్ పర్యవేక్షణ ఉంటేనే భవిష్యత్తులో ఇలాంటి భారీ బకాయిలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. రైతు పండించిన ప్రతి గింజకు లెక్క.. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి రూపాయికి రికవరీ.. ఈ రెండింటినీ సాధించడంపైనే ఇప్పుడు వ్యవస్థ దృష్టి పెట్టాల్సి ఉంది.

## విగ్రహం తొలగించిన చోటే పెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. అయినప్పటికీ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రాత్రికి రాత్రే విగ్రహాన్ని తొలగించడం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆరోపించారు.

**అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**

పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిందని ఎర్రబెల్లి దయాకర్‌రావు గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారికంగా గౌరవించిన వ్యక్తి విగ్రహాన్ని ఇప్పుడు ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. విగ్రహం తొలగింపునకు కారణం ఏమిటో ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలకు సిగ్గుండాలని తీవ్రంగా వ్యాఖ్యానించారు. నర్సంపేట నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే జరిగాయని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తించాలని కోరారు. నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

**అరెస్టులకు నిరసనగా బంద్**

విగ్రహం తొలగించిన చోటే తిరిగి ఏర్పాటు చేయాలని ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం అందుకు అంగీకరించకపోతే నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విగ్రహాన్ని తొలగించడంతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. ఈ చర్యలకు నిరసనగా నర్సంపేట బంద్‌కు పిలుపునిచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను ప్రజలు మరిచిపోరని, ఆయనకు గౌరవం దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు.



## రాబరీ మినిస్టర్‌గా పొంగులేటి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. లక్షల కోట్ల విలువైన భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి పెద్ద ఎత్తున భూదందా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వమే బ్రోకర్‌గా మారిందని మండిపడ్డారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వానికి, మంత్రికి మధ్య ఫీనిక్స్ కంపెనీ మధ్యవర్తిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్‌కు ఫీనిక్స్ కంపెనీ బినామీగా ఉందని ఆరోపించిన కాంగ్రెస్ నేతలే ఇప్పుడు అదే సంస్థతో కలిసి ప్రత్యక్షంగా బ్రోకర్లుగా మారారని విమర్శించారు. ఫీనిక్స్ కంపెనీ నుంచి రాఘవ కన్‌స్ట్రక్షన్స్, పొంగులేటికి చెందిన వివిధ కంపెనీలకు దాదాపు రూ.15 వేల కోట్ల విలువైన ఆస్తులు బదిలీ అయ్యాయని ఆరోపించారు.

**తప్పులకు రాజీనామా చేయాలి**

తన శాఖలో భారీ తప్పులు జరిగాయని మంత్రి స్వయంగా అంగీకరించి క్షమాపణ కోరుతున్నప్పుడు నైతిక బాధ్యత వహించి వెంటనే ఎందుకు రాజీనామా చేయడం లేదని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. తప్పులు చేసిన అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల ఆస్తులను ఇతర సంస్థలకు బదలాయించి, ఇప్పుడు అన్నింటినీ కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

**ఈటల ధ్వజం**



బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ భూ దందాలకే ప్రాధాన్యం ఇస్తూ సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండింతలు పెరిగిందన్నారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమలకు ఇచ్చిన స్థలాలు, ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమన్నారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కొని భూమాఫియాకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని ఈటల ఆరోపించారు. ధరణి పోర్టల్ రద్దయినా భూములను లాక్కునే ప్రభుత్వాల ధోరణిలో మార్పు రాలేదన్నారు. ధరణి నుంచి భూ భారతి వరకు పేద రైతులపైనే భారం పడుతోందని విమర్శించారు. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ ద్వారా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని అన్నారు. పేదలు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ముకాయడం మానుకోవాలని హెచ్చరించారు. భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపకపోతే బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఈటల రాజేందర్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదే

(మొదటిపేజీ తరువాయి)

ప్రెసిడెంట్‌గా ఉంటే కుటుంబ సభ్యులకే మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ పదవులు దక్కాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహేష్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి, సీతక్క, వాకిటి శ్రీహరికి మంత్రి పదవులు దక్కాయని తెలిపారు. ఉద్యమకారులకు కూడా ప్రజాపాలనలో గుర్తింపు కల్పించామని, శ్రీకాంతచారి తల్లి శంకరమ్మకు, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులు ఇచ్చామని గుర్తుచేశారు.

**అప్పుల భారాన్ని అధిగమిస్తున్నాం**

కేసీఆర్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పు చేసి తెలంగాణ పాలనను ఇబ్బందుల్లోకి నెట్టిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అప్పులకు వడ్డీలు చెల్లించిన తర్వాత మిగిలిన నిధులతోనే సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేస్తూ ప్రజలను కులవృత్తులకే పరిమితం చేయాలని చూశారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబానికి పదవులు, వేల ఎకరాల ఫామ్‌హౌజ్‌లు వస్తే కాంగ్రెస్ పాలనలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని అన్నారు. బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన గొప్ప వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని సీఎం కొనియాడారు. పాపన్న విగ్రహాన్ని నగరం నడిబొడ్డున ఏర్పాటు చేయాలన్న బహుజనుల కోరికను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ట్యాంక్‌బండ్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ పాపన్న విగ్రహాన్ని చూసి ఆయన చరిత్ర తెలుసుకునేలా ఏర్పాటు చేశామని తెలిపారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యమే పాపన్న విగ్రహానికి ఉండాలని అన్నారు. పాపన్న వీరగాథ లండన్‌లోని బ్రిటిష్ లైబ్రరీలోనూ భద్రపరిచారని గుర్తుచేశారు. మహారాష్ట్రకు శివాజీ ఎలాగో తెలంగాణకు పాపన్న గౌడ్ అలాగని పేర్కొన్నారు.

**పిల్లల చదువు బాధ్యత నాది**

కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఎన్ని వందల కోట్లయినా ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు పిల్లలను చదివించే బాధ్యత తనదేనని, తలరాతలు మార్చుకోవడానికి చదువు ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. కష్టమైనా, నష్టమైనా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి చెట్లు పెంచాలని, నేత, గీత కార్మికులకు పింఛన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సీఎం విమర్శించారు. రాష్ట్రంలో కరవు రావాలని అఘోరా పూజలు, చేతబడులు చేయించారని ఆరోపించారు. అక్రమ సంపాదనతో సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు కష్టపడి తెచ్చుకున్న ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరల పాలనకు అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే గౌడ కులస్తుల సహకారం అవసరమని కోరుతూ, 2029 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.





## ఉగ్రవాదంపై తగ్గేదేలే

- ఎంతటి చర్యలకైనా వెనుకాడం
- గైర్హాజరీలోనూ 26/11 నిందితుల విచారణ
- హఫీజ్ సయీద్ సహా ఆరుగురిపై ప్రక్రియ
- పాక్ కేంద్రంగా ఉగ్ర నెట్‌వర్క్‌లపై ఉక్కుపాదం
- భట్టి నెట్‌వర్క్‌పై భారీ ఆపరేషన్లు
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు, ఉగ్రదాడుల వెనుక ఉన్న నిందితులను చట్టం ముందు నిలబెట్టేందుకు భారత్ ఎంతటి చర్యలకైనా వెనుకాడబోదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న సున్నా సహన విధానంలో ఎలాంటి మార్పు ఉండదని తేల్చిచెప్పారు. ఉగ్రవాదం వల్ల భారత్ తీవ్రంగా నష్టపోయిందని, అంతర్జాతీయ సమాజం ఉగ్రవాద చర్యల తీవ్రతను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ముంబయి ఉగ్రదాడుల కేసులో పాకిస్థాన్‌లో తలదాచుకున్న ఆరుగురు ప్రధాన నిందితులపై గైర్హాజరీలో విచారణకు సంబంధించిన ప్రక్రియను ముంబయి పోలీసులు ప్రారంభించిన నేపథ్యంలో జైస్వాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సరిహద్దుల అవతలి నుంచి జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలను ఏకం చేసేందుకు భారత్ నిరంతరం కృషి చేస్తోందన్నారు.

**హఫీజ్ సయీద్ సహా ఆరుగురిపై విచారణ**

ముంబయి ఉగ్రదాడుల కేసులో పాకిస్థాన్‌కు చెందిన హఫీజ్ సయీద్, జకీ ఉర్ రెహ్మాన్ లఖ్వీ, సాజిద్ మీర్, అబు అల్కామా, అసిమ్ అలియాస్ అబు కహాఫా, మేజర్ అబ్దుర్ రెహ్మాన్ పాషాపై గైర్హాజరీలో విచారణ ప్రక్రియను ప్రారంభించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితులపై తదుపరి న్యాయ ప్రక్రియ చేపట్టాలని ముంబయి పోలీసులు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నిగమ్‌ను కోరారు. పరారీలో ఉన్న నిందితులు కోర్టుకు హాజరుకాకపోయినా విచారణ కొనసాగించేందుకు చట్టం అవకాశం కల్పిస్తుందని అధికారులు తెలిపారు. గైర్హాజరీలో విచారణ విధానం ద్వారా పరారీలో ఉన్న నిందితుల కారణంగా న్యాయ ప్రక్రియలో అనవసర జాప్యాన్ని నివారించవచ్చని ఉజ్వల్ నిగమ్ తెలిపారు. 2008 నవంబర్ 26న పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాదులు ముంబయిపై దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో 160 మందికిపైగా ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయపడ్డారు. దాడులకు ప్రణాళిక, సహకారం అందించిన పాకిస్థాన్‌లోని నిందితులపై చర్యలు తీసుకోవాలని భారత్ పలుమార్లు కోరుతూ వచ్చింది.

**భట్టి నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం**

ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు దేశవ్యాప్తంగా నిర్వహించిన సమన్వయ ఆపరేషన్లలో పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్న షాజాద్ భట్టి నెట్‌వర్క్‌ను భద్రతా సంస్థలు నిర్వీర్యం చేశాయని అధికారులు వెల్లడించారు. పలు రాష్ట్రాల్లో నిర్వహించిన ఆపరేషన్లలో నిందితులను అదుపులోకి తీసుకుని, భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, గూఢచర్య పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భట్టి నెట్‌వర్క్‌కు ఐఎస్ఐతో సంబంధాలున్నాయన్న భారత్ వాదనను పాకిస్థాన్ తిరస్కరించడంపై జైస్వాల్ స్పందిస్తూ, ఈ అంశంపై భారత ప్రభుత్వం ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసిందని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడిన కేసులో పరారీలో ఉన్న లష్కరే తోయిబా ఆపరేషనల్ కమాండర్ మహ్మద్ యాకూబ్‌పై జమ్మూలోని ప్రత్యేక జాతీయ దర్యాప్తు సంస్థ కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. అబు సుమామా, సుమామా ఇల్యాస్, వారిస్ అలీ అనే పేర్లతోనూ అతడు చలామణి అవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇస్లామాబాద్‌లోని చట్టా బఖ్తావర్ ప్రాంతం నుంచి లష్కరే తోయిబా కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉగ్రవాదంపై భారత్ రాజీపడే ప్రసక్తే లేదని, దేశ భద్రతకు ముప్పుగా మారే ప్రతి కుట్రను చట్టపరంగా ఎదుర్కొంటామని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.



## అధికారుల పిల్లలు ప్రభుత్వ బడుల్లోనే చదవాలి

- విద్యాశాఖ అధికారులకు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడి సూచన
- గ్రామీణ విద్యార్థుల కష్టాలు పట్టించుకోవాలి
- మంత్రులు, నేతలు ఒక్కరోజైనా గ్రామీణ బడులకు పిల్లలను పంపాలి
- మద్యం తాగి క్లాసులో నిద్రించిన హెడ్‌మాస్టర్ సస్పెన్షన్
- ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలి
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

**కాకతీయ, నేషనల్ డెస్క్ :** విద్యాశాఖ అధికారులు, రాజకీయ నాయకులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించేలా నిబంధనలు తీసుకురావాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కనీస రవాణా సౌకర్యం కల్పించడంలో మహారాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యార్థులు ప్రతిరోజూ కొన్ని కిలోమీటర్లు కాలినడకన పాఠశాలలకు వెళ్తున్నారని, వారి కష్టాలను అర్థం చేసుకునేందుకు మంత్రులు, రాజకీయ నాయకులు తమ పిల్లలను కనీసం ఒక్కరోజైనా గ్రామీణ పాఠశాలలకు పంపాలని సూచించారు. హింగోలి జిల్లాలోని తన స్వగ్రామం లింబాలలో మంగళవారం విలేకరులతో దీప్కే మాట్లాడారు. గతవారం 'స్కూల్ థిక్ కరో' పేరుతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై అవగాహన ఉద్యమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. హింగోలి నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారా అనే ప్రశ్నకు దీప్కే స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. అయితే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందితే ఎన్నికల్లో పోటీ చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మెరుగుపడటమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

**మద్యం తాగి నిద్రించిన హెడ్‌మాస్టర్**

ఇటీవల ఓ జిల్లా పరిషత్ పాఠశాల హెడ్‌మాస్టర్ మద్యం తాగి తరగతి గదిలో నిద్రిస్తున్న వీడియోను దీప్కే సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన అధికారులు సదరు హెడ్‌మాస్టర్‌ను మంగళవారం సస్పెండ్ చేశారు. అయితే ఆయన స్థానంలో కొత్త హెడ్‌మాస్టర్ వచ్చే వరకు గ్రామాన్ని విడిచి వెళ్లకుండా చూడాలని దీప్కే కోరారు. ఆ పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు అవసరం కాగా ఇద్దరే ఉన్నారని, మిగిలిన రెండు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు తమ పిల్లల చదువులు, ఉద్యోగాల విషయంలో తీవ్ర ఆందోళనతో ఉన్నారని దీప్కే అన్నారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో రాజకీయ నాయకులు విఫలమైతే ప్రజలు వారికి ఓటు వేయరని హెచ్చరించారు. పేద పిల్లలు బాగా చదువుకోవడం కొందరికి ఇష్టం లేదని, అందుకే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలిచే రాజకీయాలకే పరిమితమై, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవడంలో నేటి నాయకులు విఫలమవుతున్నారని అభిజీత్ దీప్కే విమర్శించారు.

# భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఎకరం

**భూమే పేదల ఆత్మగౌరవానికి భరోసా**
**రేవంత్ సర్కారుపై తీవ్ర ఆరోపణలు**
**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**
**22ఏ నిబంధనపై తీవ్ర విమర్శలు**
**భూ పంపిణీపై కొత్త రాజకీయ చర్చ**



కాకతీయ, హైదరాబాద్ : తెలంగాణలో సామాజిక న్యాయం సాధించాలంటే భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేయాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తాము అధికారంలోకి వస్తే భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఎకరం భూమి అందిస్తామని ప్రకటించారు. ఇందుకోసం 'భూలక్ష్మి' పేరుతో విప్లవాత్మక పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. భూమి కేవలం ఆస్తి కాదని, పేద కుటుంబాలకు ఆర్థిక భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని అందించే సాధనమని పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. తెలంగాణ సమాజంలో గుణాత్మక మార్పు రావాలంటే పేదలకు భూ పంపిణీ జరగాల్సిన అవసరం ఉందన్నారు. భూమిలేని ప్రతి పేదింటి కుటుంబానికి ఎకరం భూమి అందించడమే 'భూలక్ష్మి' పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

### రేవంత్ సర్కారుపై ధ్వజం

సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణలో రాక్షస రాజ్యం నడుస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు పేదల భూములను లాక్కొని పెద్దలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమలు, అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో పేదల భూములను తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. 22ఏ నిబంధనను ఉపయోగించి ప్రభుత్వం భూ వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడుతోందని కవిత ఆరోపించారు. ఇందిరమ్మ కాలంలో పేదలకు కేటాయించిన వేలాది ఎకరాల భూములతో పాటు గతంలో పేదలకు అందిన భూములను కూడా తిరిగి లాక్కుంటున్నారని విమర్శించారు. మరోవైపు భూ రికార్డులు, అక్రమ ఆక్రమణలు, ప్రభుత్వ భూముల వ్యవహారాలపై విచారణ కొనసాగుతోందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల వెల్లడించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించవచ్చు.


### మూడెకరాల హామీతో పోలిక

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని ప్రకటించిన విషయం కూడా ఇప్పుడు రాజకీయ చర్చకు వస్తోంది. భూమిలేని ఎస్సీ మహిళలకు వ్యవసాయ భూమి అందించే పథకం అమల్లో ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో భూ పంపిణీ జరగలేదన్న విమర్శలు గతంలో వచ్చాయి. ఈ నేపథ్యంలో కవిత ప్రకటించిన 'భూలక్ష్మి' పథకం గత భూ పంపిణీ హామీకి మరింత విస్తృత రూపంగా కనిపిస్తోంది. గతంలో నిర్దిష్ట వర్గానికి మూడు ఎకరాల భూమి పంపిణీ హామీ ఉండగా, ఇప్పుడు భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఎకరం భూమి ఇస్తామని కవిత ప్రకటించడం కొత్త రాజకీయ చర్చకు తెరతీసింది. 'భూలక్ష్మి' పథకానికి అవసరమైన భూమిని ఎక్కడి నుంచి సమీకరిస్తారు, అర్హులైన పేద కుటుంబాలను ఎలా గుర్తిస్తారు, ఒక్కో కుటుంబానికి ఎకరం చొప్పున భూమి అందించేందుకు ఎంత నిధులు అవసరమవుతాయి, సాగుకు అనుకూలమైన భూమినే కేటాయిస్తారా అనే అంశాలపై కవిత పూర్తి వివరాలను వెల్లడించలేదు. దీంతో పథకం అమలుపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇప్పటికే భూముల అంశంపై తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పలు ఆందోళనలు జరిగాయి. జూలైలో భూ పోరాటం సందర్భంగా కవితతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గత భూ పంపిణీ హామీల అమలు తీరుపై విమర్శలు ఉన్న నేపథ్యంలో 'భూలక్ష్మి' హామీని ప్రజలు ఎలా స్వీకరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికల హామీలకు, వాటి అమలుకు మధ్య ఉన్న వ్యత్యాసంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగే అవకాశం కనిపిస్తోంది. భూమిలేని పేద కుటుంబాలకు ఎకరం భూమి అనే హామీని కవిత తెలంగాణ రాజకీయాల్లో కొత్త అస్త్రంగా ముందుకు తెచ్చారు. అయితే దీనిని కార్యరూపంలోకి తీసుకురావాలంటే భూ లభ్యత, ఆర్థిక వనరులు, అర్హత ప్రమాణాలు, స్పష్టమైన విధివిధానాలపై సమగ్ర ప్రణాళిక అవసరం.

# అర్ధరాత్రి పెద్ది విగ్రహం తొలగింపు

- నర్సంపేటలో హైడ్రామా
- వేకువజామున మూడు గంటలకు అధికారుల చర్య
- భారీ పోలీసు బలగాల మోహరింపు.. గద్దెను సైతం కూల్చివేత
- బీఆర్ఎస్ నేతల గృహనిర్బంధం
- పెద్ది సుదర్శన్‌రెడ్డి భార్య పెద్ది స్వప్న కంటతడి





కాకతీయ, నర్సంపేట : నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని అధికారులు అర్ధరాత్రి తొలగించడంతో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య క్రేన్లతో విగ్రహాన్ని తొలగించారు. విషయం తెలుసుకున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి భార్య పెద్ది స్వప్న తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. ఘటనా స్థలానికి వెళ్లేందుకు ఆమె చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకుని గృహనిర్బంధం చేసినట్లు సమాచారం. నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విగ్రహం తొలగింపు సమయంలో అధికారులు గోప్యత పాటించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీగా పోలీసులను మోహరించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని సైతం సెల్‌ఫోన్లు వినియోగించకుండా కట్టడి చేసినట్లు సమాచారం. విగ్రహంతో పాటు సిమెంట్ గద్దెను కూడా పూర్తిగా తొలగించి, శిథిలాలను అక్కడి నుంచి తరలించారు. మీడియా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఆ ప్రాంతానికి రాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

### అనుమతులు లేవన్న అధికారుల వాదన

విగ్రహ ఏర్పాటుకు మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. విగ్రహం ఏర్పాటు చేసిన స్థలం ప్రభుత్వ అసైన్డ్ భూమి అని, మెడికల్ కాలేజీకి చెందిన స్థలంలో అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టారని రెవెన్యూ అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. గతంలో ఇదే ప్రాంతంలో నిర్మించిన గద్దెను అధికారులు తొలగించగా, బీఆర్ఎస్ శ్రేణులు మళ్లీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. విగ్రహం తొలగింపు నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలకు దిగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మర్రి యాదవ్‌రెడ్డితో పాటు పలువురు కీలక నేతలను గృహనిర్బంధం చేసినట్లు సమాచారం. నల్లబెల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నర్సంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

### ఉద్యమకారుడి విగ్రహాన్ని అవమానించారంటూ స్వప్న ఆవేదన

విగ్రహం తొలగింపు విషయం తెలుసుకున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి భార్య పెద్ది స్వప్న తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, నర్సంపేట ఎమ్మెల్యేగా పనిచేసిన తన భర్త విగ్రహాన్ని అర్ధరాత్రి తొలగించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. పెద్ది సుదర్శన్‌రెడ్డి జులై 31న గుండెపోటుతో మృతి చెందారు. ఆయన పదోరోజు కర్మ సందర్భంగా ఆగస్టు 10న బీఆర్ఎస్ శ్రేణులు మెడికల్ కాలేజీ ఎదుట విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచే విగ్రహ ఏర్పాటు రాజకీయంగా వివాదానికి కేంద్రబిందువైంది. తాజాగా అధికారులు అర్ధరాత్రి విగ్రహాన్ని తొలగించడంతో నర్సంపేటలో రాజకీయ వేడి మరింత పెరిగింది.

# నేరస్తులకు శిక్ష పడేలా సమర్థ దర్యాప్తు




- పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం
- మహిళలు, చిన్నారుల కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ
- సైబర్ నేరాలపై కఠిన చర్యలు
- మాదకద్రవ్యాలు, అక్రమ రవాణాపై నిఘా
- జూలైలో 15 ప్రధాన కేసుల్లో శిక్షలు
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

కాకతీయ, కరీంనగర్ : నేరం జరిగిన వెంటనే శాస్త్రీయ ఆధారాలతో సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశించారు. బాధితులకు సకాలంలో న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యతగా భావించి దర్యాప్తు నుంచి కోర్టు తీర్పు వరకు ప్రతి దశలో సమన్వయం బలోపేతం చేయాలని సూచించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆగస్టు 18న జూలై నెల నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారం, కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెంపు, మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిర్వహణపై సమీక్షించారు.

### మహిళలు, చిన్నారుల కేసులకు ప్రాధాన్యం

మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీపీ ఆదేశించారు. పోక్సో, అత్యాచారం, ఇతర మహిళా సంబంధిత కేసుల్లో కోర్టు విచారణ పురోగతిని నిరంతరం సమీక్షించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు సాక్ష్యాలు, చార్జిషీట్లు, కోర్టు పిటిషన్లను పర్యవేక్షించాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు వీలైనంత త్వరగా నగదు రికవరీ చేయాలని, మోసాలకు పాల్పడుతున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని, సీఈఐఆర్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

### అక్రమ కార్యకలాపాలపై నిఘా

మాదకద్రవ్యాలు, గుట్కా, పేకాట, అక్రమ ఇసుక రవాణా తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని సీపీ ఆదేశించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు అమలు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జూలై నెలలో 15 ప్రధాన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ప్రాసిక్యూషన్ విజయవంతంగా పనిచేసిందని సీపీ తెలిపారు. డి. శరత్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ 6 కేసులు, ఎం. ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ 5 కేసులు, ఎ. రంజిత్ కుమార్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ 2 కేసులు, జి. వీరస్వామి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ 2 కేసులు, గాయత్రి 1 కేసులో శిక్షలు సాధించడంలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. నిందితులకు జీవిత ఖైదు నుంచి 18 నెలల వరకు వివిధ జైలు శిక్షలు విధించబడ్డాయని పేర్కొన్నారు. కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు డీసీపీ వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. కృష్ణమూర్తి, అడిషనల్ పీపీ డి. శరత్, పీపీ ఎం. ప్రతాప్, అడిషనల్ పీపీలు కె. ఝాన్సీ, లక్ష్మి ప్రసాద్, శ్రీనివాస్, కుమారస్వామి, రాజేశం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రంజిత్, వీరాస్వామి, రమ ఉపేందర్, ఏసీపీలు శ్రీనివాస్, శ్రీనివాస్ జి, వెంకటస్వామి, విజయకుమార్, మాధవి, సతీష్, స్వామి, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బిల్డింగ్ పర్మిషన్‌కు రూ.20 వేల లంచం

**ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్**



కాకతీయ, హైదరాబాద్ : భవన నిర్మాణ అనుమతి కోసం లంచం డిమాండ్ చేసిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సీహెచ్ ప్రభావతి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. చార్మినార్ జోన్ పరిధిలోని సంతోష్‌నగర్ సర్కిల్–25 కార్యాలయంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. భవన నిర్మాణ అనుమతి ఫైలును ప్రాసెస్ చేయడంతో పాటు 'బిల్డింగ్ పర్మిట్ ఆర్డర్', 'వర్క్ ప్రొసీడింగ్స్/కమెన్స్‌మెంట్ లెటర్' జారీ చేసేందుకు బాధితుడి నుంచి రూ.20 వేల లంచాన్ని ప్రభావతి డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దీంతో బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ సిటీ రేంజ్–1 అధికారులు వ్యూహాత్మకంగా దాడి నిర్వహించారు. ప్రభావతి బాధితుడి నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అవినీతి ఆరోపణలపై ప్రభావతిని అరెస్టు చేసి నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుడి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయన వివరాలను గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ పేర్కొంది.

## ముదిరాజ్ కుల భవనానికి నీటి కష్టాలకు చెక్!

**రూ.1.80 లక్షల ఎమ్మెల్యే నిధులతో బోరు మోటార్ మంజూరు**

కాకతీయ, చందుర్తి : రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటలోని ముదిరాజ్ కుల సంఘ భవనంలో నెలకొన్న నీటి సమస్యకు పరిష్కారం లభించింది. సంఘం ప్రతినిధుల విజ్ఞప్తికి స్పందించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.1.80 లక్షలు మంజూరు చేసి నూతన బోరు మోటార్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కుల భవనంలో కార్యక్రమాలు నిర్వహించే సమయంలో నీటి కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయని సంఘం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించేందుకు వెంటనే నిధులు మంజూరు చేయడంతో సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో నకిలీ ప్రొసీడింగ్స్ చూపించి హామీలకే పరిమితమయ్యారని, ప్రస్తుత ప్రభుత్వంలో ఎమ్మెల్యే చొరవతో తమ సమస్యకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. త్వరలో మిగిలిన పనులు పూర్తి చేసి బోరు మోటార్‌ను వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇందూరి రాజు, తర్రే గణేష్, బొజ్జ సంజీవ్, గోంటి మనోజ్, కర్ల శ్రీను, ఈగ లచ్చయ్య, తర్రే లచ్చయ్య, ఆలూరి రవీందర్‌రావు, ఈగ శ్రీనివాస్, మరుపాక దేవరాజ్, లింగాల ప్రభాకర్, ఏనుగుల కృష్ణ, గడ్డం గంగరాజు, బందెల వెంకటేష్, ఈగ లచ్చవ్వ, గంగంపెల్లి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

**ఆగస్టు 20న కలెక్టరేట్ ఎదుట ధర్నా**

కాకతీయ, చేర్యాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ తెలిపారు. నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు స్వర్గం శ్రీకాంత్, తదూరి ప్రవీణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి పనులతో రైతులకు బహుళ ప్రయోజనాలు

**పంట కుంటలు, రీచార్జ్ పిట్ల పరిశీలన**

కాకతీయ, చందుర్తి : రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని సనుగుల, దేవుని తండా గ్రామపంచాయతీల్లో జలసిరి కార్యక్రమం కింద చేపట్టిన నీటి సంరక్షణ పనులను అధికారులు పరిశీలించారు. రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన పంట కుంటలు, ఫార్మ్ పాండ్లు, బోర్‌వెల్ రీచార్జ్ పిట్లు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలను పరిశీలించారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో సాగునీటి లభ్యత పెరగడంతో పాటు భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని అధికారులు తెలిపారు. పంట కుంటల్లో చేపల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌డీఎస్ మెంబర్ సెక్రటరీ మోర శ్రీనివాస్, డీఆర్‌డీఏ లక్ష్మీనారాయణ, డీపీఓ జయశీల, ఏపీడీ నర్సింహులు, ఎంపీడీఓ రాధ, సర్పంచ్‌లు, వీఆర్‌జీ రామ్‌జీ సిబ్బంది, ఏపీఓ, ఈసీ, టీఏలు, పీఎస్, ఎఫ్ఏ సిబ్బంది, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

## కరెంట్ సమస్యలపై అధికారుల దృష్టి!

**ఫిర్యాదులకు సత్వర పరిష్కారం**

కాకతీయ, రుద్రంగి : విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రుద్రంగి మండల కేంద్రంలోని రైతువేదికలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. రుద్రంగి, చందుర్తి మండలాలకు చెందిన వినియోగదారులు విద్యుత్ సరఫరా, ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ సేవాలోపాలు, విద్యుత్ సరఫరా సమస్యలపై వినియోగదారులు ఎలాంటి రుసుము చెల్లించకుండా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సర్వీస్ కనెక్షన్ నంబర్, పూర్తి చిరునామాతో రాతపూర్వకంగా, పోస్టు, ఈమెయిల్, వాట్సాప్ లేదా వ్యక్తిగతంగా ఫిర్యాదు అందజేయవచ్చని సూచించారు. అవసరమైతే ఫిర్యాదుదారుల వద్దకే వెళ్లి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

## మానాల బడికి పెరిగిన ఆదరణ

**240 మంది నూతన విద్యార్థుల చేరిక**

కాకతీయ, రుద్రంగి : ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేందుకు చేపట్టిన ప్రచారం మంచి ఫలితాన్నిచ్చిందని మానాల గ్రామస్తులు తెలిపారు. రుద్రంగి మండలం మానాల జడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో 240 మంది నూతన విద్యార్థులను చేర్పించినట్లు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, ఉపసర్పంచ్ దాసరి అశోక్, యువకులు, గ్రామస్తులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, వసతులపై అవగాహన కల్పించి విద్యార్థులను చేర్పించారని తెలిపారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఆగస్టు 15న కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా ప్రత్యేక ప్రశంసా పత్రం అందుకున్నామని చెప్పారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఉపాధ్యాయులను వెంటనే కేటాయించాలని, పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న నవీన్‌ను కొనసాగించేలా డిప్యూటేషన్‌కు అనుమతించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద సంఖ్యలో అడ్మిషన్లు సాధించిన మానాలను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖను కోరారు. కార్యక్రమంలో లక్కాకుల రమేష్, తుమ్ జలపతి, బదనవేణి రాజారాం పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలపై వీడని ఉత్కంఠ

**జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవీకాలం ముగిసి రెండేళ్లు**
**షెడ్యూల్‌పై స్పష్టత కోసం ఆశావహుల ఎదురుచూపులు**

కాకతీయ, వేములవాడ : తెలంగాణలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ కొనసాగుతోంది. గత జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం 2024 జూన్‌లో ముగిసినప్పటికీ, ఇప్పటివరకు కొత్త ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఆయా స్థానాల్లో ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం లేకుండానే పాలన సాగుతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వేదికలు బలహీనపడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### రిజర్వేషన్లు, ఓటరు జాబితాలపై కసరత్తు

స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లు, ఓటరు జాబితాల సవరణ, పరిపాలనా ఏర్పాట్లు వంటి అంశాలు కీలకంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలు నిర్వహిస్తామని పలుమార్లు సంకేతాలు ఇచ్చినప్పటికీ, ప్రక్రియ మాత్రం ముందుకు సాగలేదు. దీంతో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు చాలాకాలంగా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలువురు గ్రామాల్లో తమ రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. అయితే షెడ్యూల్‌పై స్పష్టత లేకపోవడంతో వారి ప్రయత్నాలు ఏ దిశగా సాగాలనే దానిపై అయోమయం నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం. అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలులో జడ్పీటీసీ, ఎంపీటీసీలు ప్రజలకు అందుబాటులో ఉండే కీలక వేదికలుగా ఉంటారు. పదవీకాలం ముగిసి రెండేళ్లు దాటుతున్న నేపథ్యంలో ఇకనైనా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుని ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలని ప్రజలు, రాజకీయ వర్గాలు కోరుతున్నారు.

# అర్ధరాత్రి మళ్లీ పెద్ది విగ్రహం తొలగింపు





**బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం..నర్సంపేటలో హైటెన్షన్**

**ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధుల ముందస్తు అరెస్టు**

**వివిధ పోలీస్ స్టేషన్లకు తరలింపు**

**ఎమ్మెల్యే దొంతి పుట్టినరోజునే ఘటన**

**ఓ వైపు ఎమ్మెల్యే బర్త్ డే వేడుకలు..మరో వైపు ఆందోళనలు**

**నర్సంపేటలో భారీగా పోలీసుల మోహరింపు**

కాకతీయ, నర్సంపేట : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని సోమవారం అర్ధరాత్రి తర్వాత తొలగించడంతో నర్సంపేటలో హైటెన్షన్ నెలకొంది. నర్సంపేట మెడికల్ కాలేజీకి సమీపంలోని ఓ ప్రైవేటు ల్యాండ్‌లో ఇటీవల పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని బీఆర్ ఎస్ నేతలు, అభిమానుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే విగ్రహ ఏర్పాటుకు ఎలాంటి అనుమతి లేదని పేర్కొంటూ అధికారులు అర్ధరాత్రి తొలగించడం వివాదాస్పదంగా మారింది. విగ్రహం తొలగింపు విషయం తెలుసుకున్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో నర్సంపేటకు చేరుకునే ప్రయత్నం చేస్తుండగా.. ఎక్కడికక్కడ అరెస్టులు చేపట్టడం గమనార్హం. ఈ ఘటనపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. నర్సంపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

**వివిధ పోలీస్ స్టేషన్లకు తరలింపు**

నల్లబెల్లి మండలానికి చెందిన ప్రజాప్రతినిధులను ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కడ ఉంచినట్లు సమాచారం. ఇతర మండలాలకు చెందిన సర్పంచులను సమీపంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ముఖ్య నాయకులందరూ ఒకే చోట గుమిగూడకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినట్లు సమాచారం. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగించిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు నర్సంపేటకు చేరుకునే అవకాశం ఉండటంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు మెడికల్ కాలేజీ పరిసరాల్లో నిఘా పెంచారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారకుండా పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

**కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే పుట్టినరోజు సందడి**

ఇదే రోజు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పుట్టినరోజు కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సంబరాలు నెలకొన్నాయి. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఒకవైపు ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలతో కాంగ్రెస్ శ్రేణుల్లో సందడి కనిపిస్తుండగా, మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపు బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆగ్రహం రేకెత్తిస్తోంది. విగ్రహం ఏ కారణాలతో తొలగించారన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం నర్సంపేటలో రాజకీయంగా దుమారం రేపుతోంది. విగ్రహం తొలగింపును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## భూ సమస్యలకు సత్వర న్యాయం చేయాలి

**పరకాల ఆర్డీఓ డిఎస్ వెంకన్న**



కాకతీయ,ఆత్మకూరు : భూభారతి సమస్యలను స్వత్వర న్యాయం చేపట్టేటట్టు అధికారులు కృషి చేయాలని పరకాల ఆర్డీఓ డిఎస్ వెంకన్న అన్నారు.మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంను సందర్శించి మాట్లాడారు భూ సమస్యల పై వచ్చిన ప్రజలకు సత్వర న్యాయం చేయాలనీ అధికారులకు సూచించారు.అనంతరం అధికారుల పనితీరును పరిశీలించి భూ భారతి సమస్యల పై అధికారులు చూపుతున్న పనితీరుపై తహసీల్దార్ నాయిని జగ్మోహన్ రెడ్డిని అభినందించారు.ఈ సందర్శనలో డిప్యూటీ తహసీల్దార్ మమత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటా

**- బీజేపీ రాష్ట్ర నాయకులు పగడాల కాళీప్రసాద్**



కాకతీయ,ఆత్మకూరు : కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా ఉంటానని బీజేపీ రాష్ట్ర నాయకులు పగడాల కాళీ ప్రసాద్ అన్నారు.మంగళవారం ఆత్మకూరు మండలంలోని పలుగ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి మాట్లాడారు కార్యకర్తలను గుండెల్లో పెట్టి కాపాడుకుంటామని పార్టీ కోసం కృషి చేసే ప్రతి కార్యకర్తకు నాయకునికి బీజేపీ పార్టీ తరఫున అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉపగాళ్ల శ్రీకాంత్ రెడ్డి, చౌలపల్లి గ్రామ సర్పంచ్ మోరే రాజేశ్వరరావు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు బలవంతుల రాజు, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ ఎద్దులపురం శ్రవణ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ టింగిలికారి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రవ్వ శివప్రసాద్, మండల ఉపాధ్యక్షులు పూజారి రవీందర్, పీసాల సాంబయ్య, కోశాధికారి జక్కుల మహేందర్, బూత్ అధ్యక్షులు యాద కుమార్, కుక్కమూడి కిరణ్, రాచర్ల నరేష్, బొల్లా రమేష్, కోరే కుమారస్వామి, మొద్దూరి పరమేశ్వర్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి బండ్‌పై ఎలక్ట్రిక్ వెహికిల్ సేవలు

**వృద్ధులు, మహిళలు, చిన్నారులకు సౌకర్యం - ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు**

**భద్రకాళి చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యం**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా నిర్మించిన భద్రకాళి బండ్‌పై సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికిల్ సేవలను మంగళవారం అధికారులు ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న, కుడా అధికారులు కలిసి ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నారులు, మహిళలు, వృద్ధులు, దూరం నడవలేని వారు బండ్‌పై సులభంగా సందర్శించేందుకు ఎలక్ట్రిక్ వెహికిల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భద్రకాళి చెరువు సుందరీకరణతో నగరానికి మరింత అందం చేకూరిందని, భక్తులు, పర్యాటకులు ప్రశాంతంగా విహరించేలా మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు.

**పర్యాటక కేంద్రంగా అభివృద్ధి**

భద్రకాళి దేవస్థానం, చెరువు పరిసరాలను ఆధ్యాత్మికత + పర్యాటక ఆకర్షణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, కుడా సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. బండ్‌పై పచ్చదనం, నడక మార్గాలు, ఇతర వసతులు అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్‌లో సందర్శకుల రద్దీకి అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో కుడా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బల్దియాలో ఖాళీ పోస్టుల గందరగోళం




- 3 సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీ
- ఆర్వోలపై అదనపు పనిభారం
- సీనియార్టీని పక్కనపెట్టి పోస్టుల భర్తీపై ఆరోపణలు
- డిప్యూటేషన్ సూపర్ కోసం సర్కిల్ లాబీయింగ్
- టేబుల్ పని వద్దు.. ఫీల్డ్ పోస్టే కావాలి

**సూపరింటెండెంట్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్**

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : ప్రభుత్వం పోస్టులు భర్తీ చేయకపోవడంతో జీడబ్ల్యూఎంసీలో పరిపాలనా వ్యవస్థ గందరగోళంగా మారిందని ఉద్యోగులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. బల్దియాలో 3 సూపరింటెండెంట్ పోస్టులు నెలలుగా ఖాళీగా ఉండటంతో వాటి పనులను కాశీబుగ్గ, ఖాజీపేట సర్కిళ్ల ఆర్వోలపై అదనంగా రుద్దారని చెబుతున్నారు. ఫీల్డ్‌లో తిరుగుతూ విధులు నిర్వహించాల్సిన ఆర్వోలకు కార్యాలయ పనులు కూడా అప్పగించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమాచారం. కాశీబుగ్గ ఆర్వో సముద్రాల రామకృష్ణ ఆరోగ్యం సహకరించడం లేదని, రెండు పోస్టులకు న్యాయం చేయలేనని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఖాజీపేట ఆర్వో గుర్రపు శ్రీను ఈ రెండు బాధ్యతలతో పాటు ఆర్డీ పనులు కూడా చూడాల్సి వస్తోందని ఆర్డీ షాహిద్ మసూద్ ద్వారా కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

**డిప్యూటేషన్ సూపర్ కోసం సర్కిల్ పోటీ**

కరీంనగర్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన సూపరింటెండెంట్ టి. బాబుకు సర్కిల్ కేటాయింపుపై లాబీయింగ్ మొదలైనట్లు బల్దియాలో చర్చ జరుగుతోంది. ఇంటికి దగ్గరగా ఉండే ఖాజీపేట సర్కిల్ కావాలంటూ అదనపు కమిషనర్ చుట్టూ తిరుగుతున్నట్లు ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇద్దరు ఆర్వోలు కూడా ఆయనను తమ సర్కిల్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. పోస్టుల కేటాయింపులో సీనియార్టీకి ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆర్వో పోస్టులను సీనియార్టీ ప్రకారం కాకుండా డబ్బులు ఇచ్చి పొందారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే సౌకర్యవంతమైన సూపరింటెండెంట్ పోస్టు కంటే క్షేత్రస్థాయిలో ఎక్కువ బాధ్యతలు ఉండే ఆర్వో పోస్టు కోసం పోటీ పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

**అమ్యామ్యాల కోసమేనా**

డిప్యూటేషన్‌పై వచ్చిన సూపరింటెండెంట్‌కు సర్కిల్ కేటాయింపు కోసం జరుగుతున్న ప్రయత్నాలు పని తగ్గించుకోవడం కోసం కాకుండా అదనంగా వచ్చే అమ్యామ్యాల కోసమేన ని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యం సహకరించని పరిస్థితి ఉంటే కార్యాలయంలో టేబుల్ వర్క్ ఉండే సూపరింటెండెంట్ బాధ్యతలు తీసుకోవచ్చని, అయినప్పటికీ ఆర్వో పోస్టుపై ఎందుకు ఆసక్తి చూపుతున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. బల్దియాలో ఖాళీగా ఉన్న 3 సూపరింటెండెంట్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఉద్యోగులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సీనియార్టీ ప్రాతిపదికన నియామకాలు చేపట్టి, ఆర్వోలపై అదనపు పనిభారం తొలగించాలని కోరుతున్నారు. పోస్టుల భర్తీలో పారదర్శకత పాటించాలని, ఆరోపణలకు తావులేకుండా స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## బల్దియా పారిశుధ్యంపై ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ బృందం అధ్యయనం

**వ్యర్థాల సేకరణ నుంచి ప్రాసెసింగ్ వరకు క్షేత్రస్థాయి పరిశీలన**

**కమిషనర్ టి. వెంకన్నతో సమావేశం**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)లో అమలవుతున్న పారిశుధ్య నిర్వహణ విధానాలపై అధ్యయనం చేసేందుకు ఎంఎస్ స్వామినాథన్ పరిశోధనా సంస్థ (ఎంఎస్ఎస్ఆర్ఎఫ్), చెన్నైకి చెందిన బృందం రెండు రోజుల పర్యటనకు వచ్చింది. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ టి. వెంకన్నతో సమావేశమై ఇంటింటి వ్యర్థాల సేకరణ, తడి–పొడి చెత్త వేరు చేయడం, స్వచ్ఛ ఆటోల నిర్వహణ, పారిశుధ్య సిబ్బంది విధులు, వ్యర్థాల ప్రాసెసింగ్‌పై చర్చించింది. శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లతో డివిజన్ల వారీగా పారిశుధ్య పనుల నిర్వహణ, సమస్యలు, ప్రజల భాగస్వామ్యంపై వివరాలు సేకరించారు. శానిటరీ జవాన్లతో క్షేత్రస్థాయి విధులు, సవాళ్లు, ప్రజల సహకారంపై చర్చించారు. బాలసముద్రంలో స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో ఇంటింటి చెత్త సేకరణ, రూట్ల నిర్వహణపై, కంపోస్టింగ్, బయోమెథనేషన్ యూనిట్ సిబ్బందితో సేంద్రియ వ్యర్థాల ప్రాసెసింగ్‌పై వివరాలు తెలుసుకున్నారు.

**డీఆర్‌సీసీ సందర్శన**

మొదటి రోజు పర్యటనలో భాగంగా నక్కలగుట్ట డీఆర్‌సీసీని సందర్శించిన బృందం అక్కడి కార్యకలాపాలను పరిశీలించింది. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి క్షేత్రస్థాయి అధ్యయనం కొనసాగించనుంది. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి, ఎస్ఈ రాజ్‌కుమార్, ఎంహెచ్ఓ డా. రాజేష్, ఈఈ మహేందర్, సూపరింటెండెంట్ బాకం సంతోష్, డీఈ స్పందన తదితరులు పాల్గొన్నారు.

## అనధికారిక ఫ్లెక్సీలపై బల్దియా ఉక్కుపాదం

**అనుమతి లేకుండా ముద్రించినా క్రిమినల్ కేసులు**

**ఫ్లెక్సీ తయారీదారులకు కమిషనర్ హెచ్చరిక**




కాకతీయ, వరంగల్ ప్రతినిధి: నగర సుందరీకరణకు విఘాతం కలిగిస్తున్న అనధికారిక కమర్షియల్ ఫ్లెక్సీలపై బల్దియా కఠిన చర్యలకు సిద్ధమైంది. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ముద్రించినా, ఏర్పాటు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న హెచ్చరించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఫ్లెక్సీ తయారీదారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భవనాలు, జంక్షన్లు, మీడియన్లు, డివైడర్లు, టెలిఫోన్, విద్యుత్ స్తంభాలు, చెట్లపై కమర్షియల్ ఫ్లెక్సీల ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని కమిషనర్ స్పష్టం చేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే బల్దియా నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని, అనుమతించిన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫ్లెక్సీ తయారీదారులకు నిబంధనల కాపీలను అందజేస్తామని, ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనధికారిక ఫ్లెక్సీల నియంత్రణకు పోలీసు శాఖ సహకారం తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మునిసిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి శంకర్‌లింగం, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డీసీలు ప్రసన్న రాణి, సమ్మయ్య, ఎస్ఎఫ్ఓ రాజేశ్వర్‌రావు, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దొంతి దిష్టిబొమ్మతో శవయాత్ర

**పెద్ది విగ్రహ నిర్మాణం కూల్చివేతపై బీఆర్ఎస్ భగ్గు**

**కాంగ్రెస్ తీరుపై ఆకుల శ్రీనివాస్ మండిపాటు**

**నియోజకవర్గవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు**



కాకతీయ, నర్సంపేట టౌన్: దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం నిర్మించిన నిర్మాణాన్ని కూల్చివేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. మంగళవారం తొగర్రాయిలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి అనంతరం దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కోసం చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. ప్రజాసేవ చేసిన దివంగత నేతను అవమానించేలా వ్యవహరించడం సరికాదన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన పెద్ది జ్ఞాపకాలను నిర్మాణాలు కూల్చడం ద్వారా చెరిపేయలేరని స్పష్టం చేశారు.

**అభిమానాన్ని కూల్చలేరు**

"నిర్మాణాన్ని కూల్చగలరేమో.. పెద్ది సుదర్శన్‌రెడ్డిపై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని మాత్రం కూల్చలేరు" అని శ్రీనివాస్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు పాల్పడటం తగదన్నారు. విగ్రహ నిర్మాణం కూల్చివేతపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా నర్సంపేట నియోజకవర్గవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన ప్రజాసేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తుమ్మలపల్లి మహేందర్, బొల్లం అనిల్, పొగాకు ప్రేమ్ కుమార్, బుక్క సునీల్, హనుమకొండ అనిల్, అన్న లక్ష్మణ్, రాసరాజు, గొర్రె రాంబాబు, పెంతల మహేష్, పెంతల గణేష్, అమ్మిరెడ్డి రాజు, జట్టబోయిన రాజు, తుమ్మలపల్లి శ్రీనివాస్, కస్తూరి రాజు, హనుమకొండ బాబు, చిలువేరు సుమన్, హనుమకొండ ప్రభాకర్, హర్షం చిరంజీవి, చిలువేరు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్వాయి పాపన్న జయంతి..



కాకతీయ,ఆత్మకూరు : ఆత్మకూరు మండలం కటాక్షపుర్ గ్రామ శివారులో శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయం వద్ద సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతిని గౌడ కులస్తులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గౌడ్ సంఘం అధ్యక్షుడు మచ్చిక రవి గౌడ్,మాజి సర్పంచ్ మచ్చిక యాదగిరి గౌడ్ పాపన్న విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు ముంజల మల్లయ్య, శ్రీపతి దేవేందర్, పుట్ట మల్లయ్య, పుట్ట శ్రీను, పుట్ట సాయి, మచ్చిక పాణి, మచ్చిక నరేష్, మచ్చిక పెద్ద రవి, వడ్లకొండ శ్రీను, గుజ్జేటి సదయ్య గుజ్జేటి రాజు, పూజారి రాజేష్, పూజారి దామోదర్ కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మల దహనం.. గిర్నిబావిలో శవయాత్ర..



### విగ్రహం కూల్చివేతపై ఆగ్రహం..

కాకతీయ, వరంగల్ బ్యూరో : మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని కూల్చివేయడాన్ని నిరసిస్తూ ఆయన అభిమానులు, అనుచరులు నర్సంపేట నియోజకవర్గంలో ఆందోళనలకు దిగారు. విగ్రహం కూల్చివేతకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి బాధ్యత వహించాలని ఆరోపిస్తూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కూల్చివేత ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన అభిమానులు, అనుచరులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దొంతి మాధవరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ ఘటనతో పలు ప్రాంతాల్లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



### గిర్నిబావిలో వినూత్న నిరసన..

గిర్నిబావి గ్రామంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి అభిమానులు మరింత వినూత్నంగా నిరసన తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి, అనంతరం దహనం చేశారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డికి అనుకూలంగా, దొంతి మాధవరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని కూల్చివేయడం తమను తీవ్రంగా కలచివేసిందని అభిమానులు తెలిపారు. రాజకీయ విభేదాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో విమర్శలు చేసుకోవాలని, విగ్రహాలను కూల్చివేయడం వంటి చర్యలకు పాల్పడటం సరికాదని వారు అన్నారు. ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో నర్సంపేట నియోజకవర్గంలో చోటుచేసుకున్న నిరసనలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఆందోళనల నేపథ్యంలో పోలీసులు ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.

## పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



కాకతీయ, ఇనుగుర్తి: మండలంలోని వివిధ గ్రామాలలో సర్దార్ సర్వాయి పాపన్న 376 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్న నాగారం గ్రామంలో జై గౌడ యువజన సంఘం మండల అధ్యక్షుడు మద్దెల సుధాకర్ గౌడ్, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోల్కొండ కోటను జయించిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించడానికి బహుజనులు ఐక్యతగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెడుపాక సుజాత యాకయ్య ఉపసర్పంచ్ తుమ్మనపల్లి సతీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్, నాయకులు బైరు శ్రీనివాస్, కొయ్యడియా కాంతం, వెంకన్న, శ్రీరాములు, బైరు వెంకటేశ్వర్లు,యాఖూబ్, అనిల్ సందీప్, వినయ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కాకతీయ, పెద్దవంగర : ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పెద్దవంగర గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర కంటి ఆసుపత్రి, నానక్‌రామ్‌గూడ కంటి హాస్పిటల్ సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పారిజాతసురేష్ మాట్లాడుతూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కంటి సమస్యలు ఏర్పడిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే చూపును కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకులు గద్దల జాను, కార్యదర్శి వెంకన్న, మహబూబాబాద్ జిల్లా కోఆర్డినేటర్ పసునూరి యాకయ్య, పెద్దవంగర మండల కోఆర్డినేటర్ జలగం రామ్మూర్తి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రాయపర్తిలో ఝాన్సీ రెడ్డి జన్మదిన వేడుకలు

### రక్తదాన శిబిరం.. పేదలకు అన్నదానం



కాకతీయ, రాయపర్తి: టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం రాయపర్తి మండలంలో సేవా కార్యక్రమాలతో స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఝాన్సీ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రయాణ ప్రాంగణంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ పర్యవేక్షణలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. పేదలు, వేడుకలకు హాజరైన వారికి అన్నదానం చేశారు. ఝాన్సీ రెడ్డి ప్రజా శ్రేయస్సు, పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని ఈదులకంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## దొంతి మాధవరెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు

**నియోజకవర్గమంతా పెద్ది విగ్రహాలు పెడతాం**

**రానున్న ఎన్నికల్లో దొంతి ఓటమి ఖాయం**

**సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపుపై మాజీ ఎమ్మెల్యే నన్నపునేని ఫైర్**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: తెలంగాణ ఉద్యమ నేత, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడంపై వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గృహనిర్బంధంలో ఉన్న తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మరణించిన వ్యక్తిపై కక్ష సాధించడం సరికాదని నరేందర్ అన్నారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి అనుమతి ఇచ్చి, తెలంగాణ కోసం పోరాడిన పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. పెద్ది అంత్యక్రియల అనంతరం ఆయన కుటుంబంపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. ఒక విగ్రహం తొలగిస్తే నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని నరేందర్ తెలిపారు. అప్పుడు పోలీసు యంత్రాంగం ఏం చేస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నర్సంపేట ప్రజలు ఇప్పటికే రోడ్డెక్కారని, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ఓటమి తప్పదని అన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని, ప్రజల మనోభావాలను గౌరవించకుండా తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వరంగల్‌లో విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడలు


**బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ పోటీలకు ట్రాన్స్‌కో వరంగల్ ఆతిథ్యం**

**క్రీడలు ఉద్యోగుల ఆరోగ్యం, ఉల్లాసానికి దోహదపడతాయి : సీఈ మురళీ సాగర్**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: ట్రాన్స్‌కో వరంగల్ సర్కిల్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, కాకతీయ మెడికల్ కాలేజీ ఫుట్‌బాల్ మైదానంలో ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌కో వరంగల్ జోన్ సీఈ మురళీ సాగర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు ఉద్యోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఉద్యోగులు విధులతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలని ఆకాంక్షించారు. ట్రాన్స్‌కో, డిస్కమ్‌లకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఓఅండ్ఎం వరంగల్, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు రవీంద్ర, ఎస్ఈ సివిల్ టి.వి. రావు, 400 కేవీ ఎస్ఈ శ్రీనివాసులు, డీఈలు మహేష్, శ్రీనివాస్‌రావు, జగన్నాథ్, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్, వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ పుల్యాల రాజిరెడ్డి, ఎన్‌పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాగ సుబ్రహ్మణ్యేశ్వరుడికి శ్రావణమాస ప్రత్యేక పూజలు




కాకతీయ, గీసుకొండ: శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా మండలంలోని ఊకల్ గ్రామంలో కొలువై ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శన ఆచార్యులు స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వ హించి, వేద మంత్రోచ్ఛర ణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో, గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణమాసం తొలి మంగళవారం కావడంతో జిల్లానలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పుట్టలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

### ఆలయ అభివృద్ధికి రూ.1,00,116 విరాళం..

శ్రావణమాస తొలి మంగళవారం సందర్భంగా గీసుగొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్, సామాజికవేత్త పెగళ్లపాటి లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ అర్చకులు సముద్రాల సుదర్శన ఆచార్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వర రావు, గ్రామ సర్పంచ్ కక్కెర్ల సుభాష్, ఎన్పీడీసీఎల్ డీడీ మల్లికార్జున్,గీసుగొండ వాస్తవ్యులు కర్ణకంటి రాంమూర్తి, ముల్క సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీలను ప్రజలు సద్వినియోగించుకోవాలి

- గ్రామా పంచాయితీలను సందర్శించిన పంచాయితీ రాజ్ కమిషనర్..
- ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- రాష్ట్ర పంచాయితీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ జాయింట్ కమిషనర్ శ్రీనాథ్



కాకతీయ,ఆత్మకూరు : ఉపాధి హామీ పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర పంచాయితీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ జాయింట్ కమిషనర్ శ్రీనాథ్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండలం కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి అధికారుల పని తీరును పరిశీలించారు అనంతరం మండలంలోని పెంచికలపేట, అగ్రంపహాడ్ గ్రామపంచాయతీలను సందర్శించి ఎగితే రాజయ్య పొలంలో 18 వేల రూపాయలతో విబిజి రంజీ నిధులతో నిర్మిస్తున్న ఫాంపాండు పనులను సందర్శించి కూలీలతో మాట్లాడారు ఉపాధి హామీ పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తెలిపారు.అనంతరం తిరుమలగిరి గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక డాటా నమోదు కార్యక్రమాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తనిఖీ చేయడం జరిగింది.అందరు రైతులు వి బి జి రాంజీ ద్వారా చేపడుతున్న ఇట్టి పాంపాండ్ పనులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డిపిఓ రమాకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, డిఎల్పిఓ రవిబాబు, ఎంపీఓ యోగిత, ఏపీవో రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బుచ్చిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పాష తదితరులు పాల్గొన్నారు.

## పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరానికి చాటాలి



కాకతీయ, గీసుగొండ: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ, ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు వల్లుల సారంగపాణి అన్నారు. మండలంలోని మచ్చాపూర్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ బహుజనుల కోసం పోరాడి, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీ యమన్నారు. ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కోల వెంకట స్వామి, పెరుమాండ్ల ప్రవీణ్,ఎరుకొండ కొమురెల్లి, ఎరుకొండ వసుదేవుడు, బత్తిని భాస్కర్,సట్ల శ్రీనివాసు,కోల బుచ్చిబాబు,బుర్ర ఆగయ్య,శ్రీను, యాదగిరి,దూలం శ్రీకాంత్, దేశిని అనిల్,గండు రాజు,దూలం బుచ్చి మధు, బుచ్చి బాబు,దూలం రాకేష్,సునీల్,కుమార్,రమేష్, రాజు, విలాస్,శ్రావణ్, కుమార్, నరేష్,కుమార స్వామి,ప్రశాంత్, సంతోష్,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.15

## ఇష్టపడి కష్టపడితేనే విద్యార్థులకు విజయం

**మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి: కలెక్టర్ స్నేహ శబరిష్**

**గురుకుల బాలికల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**



కాకతీయ, ఇనుగుర్తి: ఇష్టపడి కష్టపడితేనే చదువులో విజయం సాధించి ఉన్నత స్థాయికి చేరుకుంటారని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, వంటశాల, వసతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం సమయానికి నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. తాగునీటి ప్లాంట్, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యత, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి శేరీష, ప్రిన్సిపాల్ జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపుపై నల్లబెల్లిలో నిరసన

**బంద్‌కు మద్దతుగా స్వచ్ఛందంగా దుకాణాల మూసివేత**

**మాధవరెడ్డి దిష్టిబొమ్మ దహనం**



కాకతీయ, నల్లబెల్లి: నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎదుట అర్ధరాత్రి దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ నల్లబెల్లి మండలంలో మంగళవారం స్వచ్ఛంద బంద్ పాటించారు. బీఆర్ఎస్ శ్రేణుల పిలుపుతో వ్యాపారులు దుకాణాలు మూసివేసి నిరసనకు మద్దతు తెలిపారు. నర్సంపేట అభివృద్ధికి పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన సేవలను గుర్తించి ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించడం బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు పేర్కొన్నారు. ఆయన సతీమణి పెద్ది స్వప్న విగ్రహం తొలగింపుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భర్త మరణించి నెల రోజులు కూడా పూర్తికాకముందే విగ్రహాన్ని తొలగించడం కలచివేసిందని కన్నీటి పర్యంతమయ్యారు. నిరసనకు సిద్ధమైన నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని తిరిగి అదే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇంటి ముందు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

# బడుగు బలహీన వర్గాల కోసం పాపన్నగౌడ్ పోరాటం

- లకారం ట్యాంక్‌బండ్‌పై విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణుల పూలమాలలు



కాకతీయ, ఖమ్మం టౌన్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఖమ్మం నగర బీఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో మంగళవారం లకారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జయంతి సభలో బీఆర్ఎస్ మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు పాల్గొని మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గొప్ప పోరాట యోధుడని, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడని పగడాల నాగరాజు కొనియాడారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు పాపన్న గౌడ్, దొడ్డి కొమరయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి తెలంగాణ వైతాళికుల చరిత్రను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యక్రమాలు జరగలేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ సమాజం కోసం, బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను వెలుగులోకి తీసుకువచ్చారనినాగరాజు అన్నారు. వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేసిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

**లకారం అభివృద్ధికి పువ్వాడకు కృతజ్ఞతలు**

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ లకారం ట్యాంక్‌బండ్‌ను సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేశారని నాగరాజు అన్నారు. పాపన్న గౌడ్, దొడ్డి కొమరయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ తదితర తెలంగాణ వైతాళికుల విగ్రహాలను ఏర్పాటు చేసి వారి చరిత్రను యువతకు చేరువ చేశారని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ధైర్యం, ఆత్మగౌరవం, సమానత్వం కోసం చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అమరగాని వెంకన్న గౌడ్, దండా జ్యోతిరెడ్డి, మాజీ కార్పొరేటర్ కూరాకుల వలరాజు, మొహమ్మద్ తాజుద్దీన్, మేకల సుగుణారావు, పూటుకూరి రవికాంత్, షకీనా, పొదిలా నాగరాజు, వాంకుడోతు సురేష్, వాకాదని కోటేశ్వరరావు, కందాల వీరేందర్, వీరన్న, కొల్లి విద్యాసాగర్, షేక్ సాజిద్, గుండా కోటేశ్వరరావు, వీరేష్ గౌడ్, పగిళ్ల రాజు, మాతంగి అనిల్, తోడేటి లింగరాజు, మాదిరాజు శ్రీనివాస్, దండగల రాంబాబు, ఉస్మాన్, గుంటి రాజు, మెడబోయిన నగేష్, నాగబోయిన నాగరాజు, పిడతల రాంమూర్తి, కూచిపూడి కిషోర్, సూరేపల్లి ఉపేందర్, కర్ణకోటి ఉపేందర్, సందీప్, పగడాల సాయి, ఇంటి మాదవి, శైలజ, నరాల సాయి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

**సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**



కాకతీయ, ఖమ్మం: మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో లకారం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పాపన్న గౌడ్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కులు, సామాజిక సమానత్వం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా సంక్షేమం కోసం ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. జానయ్య, బీసీ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ గురుకుల డిగ్రీ కళాశాలల పని వేళలు మార్చాలి

**ప్రభుత్వ ముఖ్య సలహాదారు హనుమంతరావుకు వినతిపత్రం**



కాకతీయ, తుంగతుర్తి: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల సొసైటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల పని వేళలను మార్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తన్నీరు గిరిప్రసాద్ కోరారు. మంగళవారం డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ప్రభుత్వ ముఖ్య సలహాదారు హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కళాశాలలు నిర్వహిస్తున్నారని, ఎస్సీ గురుకులాల తరహాలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని వేళలను పరిమితం చేయాలని కోరారు. ఈ విషయంపై మంత్రి, సొసైటీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. పాఠశాలల కంటే డిగ్రీ కళాశాలల్లో పని వేళలు ఎక్కువగా ఉండటంతో బీసీ గురుకులాల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి పని వేళలను మార్చాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ రాజ్యశ్రీ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమారస్వామి, డిగ్రీ లెక్చరర్లు సుమాంజలి, కుమారి, దివ్యవాణి, విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జంపాల రాజేష్, ప్రధాన కార్యదర్శి పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



కాకతీయ, కారేపల్లి: అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గౌడ్ సంఘం నాయకులు కొనియాడారు. కారేపల్లి మండల గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఆయన 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి నాయకులు, ప్రతినిధులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొఘల్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన ఆయన స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత కృషి చేయాలని, ఆయన చరిత్ర, పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ్ సంఘం నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

## సర్పంచుల శిక్షణలో గ్రామ సమస్యలపై వినతి



కాకతీయ, కారేపల్లి: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో సింగరేణి, కారేపల్లి మండలాలకు చెందిన సర్పంచులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉసిరికాయలపల్లి గ్రామ సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు, బానోత్ ప్రియాంక కుమార్ తదితరులు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను కలిశారు. గ్రామాల అభివృద్ధి, స్థానిక సంస్థలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి శాలువాతో సత్కరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులపై రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు గుగులోత్ వరలక్ష్మి రాజు తెలిపారు. శిక్షణతో గ్రామపంచాయతీల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెరిగిందని సర్పంచులు పేర్కొన్నారు.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపును ఖండిస్తున్నాం

**తాటికొండ సీతయ్య, మాజీ ఎంపీపీ**



కాకతీయ, తుంగతుర్తి: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా మున్సిపల్ అధికారులతో విగ్రహాన్ని తొలగించడం విచారకరమన్నారు. ఉద్యమకారులను గౌరవిస్తామని చెప్పే కాంగ్రెస్ నాయకులు కావాలనే బీఆర్ఎస్ కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, తునికి సాయిలు గౌడ్ పాల్గొన్నారు.

## భద్రకాళి బండ్‌పై మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి




**ఓబీసీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్**

కాకతీయ, హనుమకొండ : హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మాజీ కుడా చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో హనుమకొండలోని భద్రకాళి బండ్ వద్ద ప్రొఫెసర్ జయశంకర్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. మహనీయుల చరిత్ర, పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికార సాధన, స్వయం సమృద్ధి గ్రామీణ పరిపాలనలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రస్థానానికి చారిత్రక ప్రాధాన్యత ఉందని సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించిన పాపన్న అన్యాయాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని, ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు.

**విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలి**

మహనీయుల జయంతి వేడుకల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి వారి చరిత్ర, ఆశయాలను యువతకు తెలియజేయాలని సుందర్‌రాజ్ యాదవ్ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఓబీసీ నాయకులు వేణుమాధవ్ గౌడ్, చక్రపాణి, రాజు, గౌడ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్ గౌడ్, మధు గౌడ్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విద్యార్థుల వసతులు, విద్యాబోధనపై ఆరా**




కాకతీయ, కారేపల్లి: సింగరేణి మండలం రేలాకాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజనం, పారిశుధ్యంపై పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి చదువు, సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పాఠశాల పరిసరాలు, తాగునీరు, వసతిగృహాలు, భోజనశాల, పారిశుధ్య నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, వారి ప్రతిభను వెలికితీసేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

## లకారం ట్యాంక్‌బండ్‌లో పారిశుధ్య, గ్రీనరీపై ప్రత్యేక దృష్టి

**లకారం ట్యాంక్‌బండ్‌ను సందర్శించిన మున్సిపల్ కమిషనర్**



కాకతీయ, ఖమ్మం టౌన్: ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచే చర్యల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ మంగళవారం లకారం ట్యాంక్‌బండ్‌ను సందర్శించారు. పరిసరాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్యాంక్‌బండ్‌లో పరిశుభ్రతతో పాటు గ్రీనరీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డివైడర్లలోని మొక్కలకు ప్రతిరోజూ నీరు అందేలా, డ్రిప్ పైప్‌లైన్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. వర్షాల సమయంలో వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట మొక్కలు నాటాలని సూచించారు. ఫుడ్ స్టాళ్ల వద్ద చెత్తను బహిరంగంగా వేయకుండా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, వాటిని ప్రతిరోజూ ఖాళీ చేయాలని ఆదేశించారు. పార్కుల్లో అవసరమైన చిన్న మరమ్మతులు వెంటనే చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఆఫీసర్ రాధికను ఆదేశించారు.

## కాకతీయుల కళాతోరణంపై రాజకీయ ఫ్లెక్సీ

**చారిత్రక కట్టడం వద్ద ప్రచారంపై విమర్శలు**

**వాట్సాప్ గ్రూపుల్లో జోరుగా చర్చ**

కాకతీయ, నర్సంపేట టౌన్: కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచిన కళాతోరణం వద్ద భారీ రాజకీయ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చారి త్రక కట్టడం స్పష్టంగా కనిపించే ప్రాంతంలో రాజకీయ నాయకులు, కార్యకర్తల చిత్రాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయ డంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక వారసత్వ సంపదను కాపాడాల్సిన ప్రాంతాల్లో రాజకీయ ప్రచారానికి అనుమతి ఎలా ఇచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు. కళాతోరణం కాకతీయుల చరిత్ర, శిల్పకళకు ప్రతీకగా నిలుస్తుండగా దాని ముందు రాజకీయ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం చారిత్రక ప్రదేశం ప్రాధాన్యాన్ని తగ్గించేలా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై వాట్సాప్ గ్రూపుల్లోనూ చర్చ జోరందుకుంది. చారిత్రక కట్టడాల పరిరక్షణ, అధికారుల తీరుపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

## డీఎంవోగా కె. నాగరాజు

**సిద్దిపేట నుంచి బదిలీ..**

**కలెక్టర్ సత్యశారదను కలిసి శుభాకాంక్షలు**

కాకతీయ, వరంగల్ ప్రతినిధి: వరంగల్ జిల్లా మార్కెటింగ్ అధికారిగా (డీఎంవో) కె. నాగరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ సురేంద్రమోహన్ ఉత్తర్వుల మేరకు సిద్దిపేట డీఎంవోగా పనిచేస్తున్న నాగరాజును వరంగల్‌కు బదిలీ చేశారు. వరంగల్ డీఎంవోగా పనిచేసిన సురేఖ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పోస్టు ఖాళీ అయింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగరాజు జిల్లా కలెక్టర్ డా. సత్యశారదను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# సిందూర్‌పై పాక్ సైన్యం ఏడుపు

- భారత్ కథనం ఏకపక్షమంటూ ఆరోపణ
- డాక్యుసిరీస్‌లో వాస్తవాలు వక్రీకరించారంటూ విమర్శలు
- పహల్గామ్ దాడికి భారత్ దీటైన బదులు
- భట్టి నెట్‌వర్క్‌పై 14 రాష్ట్రాల్లో ఉక్కుపాదం
- అమిత్ షా వ్యాఖ్యలపైనా పాక్ అభ్యంతరం
- భారత సైనిక చర్యలతో పాక్ ఉక్కిరిబిక్కిరి

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌పై భారత్ రూపొందించిన డాక్యుసిరీస్‌ను పాకిస్థాన్ సైన్యం తీవ్రంగా ఖండించింది. క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి ఏకపక్ష కథనాన్ని మాత్రమే చూపించారని ఆరోపించింది. ఆపరేషన్ సిందూర్‌ను భారత్‌కు అనుకూలంగా అత్యంత నాటకీయంగా చిత్రీకరించారని విమర్శించింది. డిస్కవరీ సంస్థ రూపొందించిన 'డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్' డాక్యుసిరీస్‌పై పాక్ సైన్యం మీడియా విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. రెండు భాగాలుగా రూపొందిన డాక్యుసిరీస్‌లో భారత సీనియర్ రాజకీయ, సైనిక నాయకత్వం ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన కీలక అంశాలను వివరించింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ మాట్లాడుతూ భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని, దాన్ని చేతగానితనంగా భావిస్తే సహించబోదని స్పష్టం చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యులైన వారితో పాటు ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకునేలా సైనిక చర్య చేపట్టినట్లు వివరించారు.

**88 గంటల పోరాటం**

గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతీకారంగా మే 7న తెల్లవారుజామున భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై దాడులు చేసింది. ఇరు దేశాల మధ్య దాదాపు 88 గంటల పాటు ఉద్రిక్తత కొనసాగి, మే 10న అవగాహనతో ముగిసింది. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు దేశవ్యాప్తంగా భద్రతా సంస్థలు పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్న షెహజాద్ భట్టి నెట్‌వర్క్‌పై భారీ ఆపరేషన్ నిర్వహించాయి. 14 రాష్ట్రాల్లో చేపట్టిన సోదాల్లో 200 మందికిపైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్న ఐఈడీలు, గ్రెనేడ్లు, పిస్టళ్లు, తూటాలు, సీసీటీవీ కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**ఉగ్ర కుట్రలకు చెక్**

ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్‌తో పాటు తెలంగాణ, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాల్లో నెట్‌వర్క్ సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పేలుళ్లు, గ్రెనేడ్ దాడులు, లక్షిత హత్యలు, పోలీసు, రక్షణ, మతపరమైన ప్రాంతాల రెక్కీల్లో ఈ నెట్‌వర్క్ ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. భట్టి నెట్‌వర్క్‌కు పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్నాయన్న అమిత్ షా వ్యాఖ్యలను పాక్ విదేశాంగ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ ఖండించారు. భారత్ తన దేశీయ భద్రతా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే పాకిస్థాన్‌పై ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. అయితే ఉగ్రవాదంపై సున్నా సహన విధానాన్ని కొనసాగిస్తామని, దేశ భద్రతకు ముప్పుగా మారే ప్రతి కుట్రను కఠినంగా అణచివేస్తామని భారత్ స్పష్టం చేస్తోంది.

# నెలాఖరులోగా 22ఏ భూముల సమస్యకు పరిష్కారం

- అధికారుల పొరపాట్లతోనే ప్రైవేటు భూములు నిషేధిత జాబితాలోకి
- ఇప్పటికే 5కి పైగా భూముల రిజిస్ట్రేషన్లు పూర్తి
- ప్రత్యేక కమిటీతో సమస్యల పరిష్కారం
- హరీశ్‌రావుపై పొంగులేటి విమర్శలు
- ఆధారాలుంటే బయటపెట్టాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి సవాల్
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** 22ఏ నిషేధిత భూముల జాబితాలో ప్రైవేటు భూములు చేరడానికి అధికారుల పొరపాట్లే ప్రధాన కారణమని, ఈ సమస్యను నెలాఖరులోగా పూర్తిగా పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే 5కి పైగా భూముల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలిస్తామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి జీవోలు, మెమోల ద్వారా హక్కులు పొందిన భూ రికార్డులను, కోర్టు ఆదేశాలను సరిగ్గా ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్లే సమస్య తలెత్తిందన్నారు. గతేడాది హైకోర్టు సూచనల మేరకు నిషేధిత జాబితాను ఆన్‌లైన్ చేసినప్పుడు పాత రికార్డులు ఉండటంతో ప్రైవేటు ఆస్తులు కూడా 22ఏ పరిధిలోకి వెళ్లాయని వివరించారు. ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.



**22ఏ జాబితాపై ప్రక్షాళన**

ఇటీవల భూ రిజిస్ట్రేషన్ల ప్రక్షాళన సమయంలో పన్నులు చెల్లిస్తున్న భూములను కూడా రిజిస్టర్ చేసేందుకు అధికారులు నిరాకరించడంతో ప్రజల్లో ఆందోళన నెలకొందని మంత్రి చెప్పారు. దీనిని ప్రభుత్వం సరిదిద్దుతోందన్నారు. అర్హత ఉన్న ప్రైవేటు భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తున్నామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న హరీశ్‌రావు 30 శాతం కమిషన్ల వ్యవహారాన్ని ఇంకా మర్చిపోలేదని పొంగులేటి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయినప్పుడు ఆయన ఎందుకు బాధ్యత తీసుకోలేదని ప్రశ్నించారు. అబద్ధాలతో అధికారంలోకి రావాలనుకుంటున్న ఆయన కల ఎప్పటికీ పగటికలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. తాను బాధ్యతగల మంత్రిగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నానని స్పష్టం చేశారు.

**ఏలేటికి సవాల్**

బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని మంత్రి అన్నారు. తనపై ఏవైనా ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ చేశారు. ఫీనిక్స్, రాఘవ కంపెనీల మధ్య వ్యాపార లావాదేవీలు సాధారణంగానే జరుగుతాయని తెలిపారు. తాను 20 ఏళ్లుగా వ్యాపార రంగంలో ఉంటూ అంచెలంచెలుగా ఎదిగి మంత్రి స్థాయికి వచ్చానని, రబ్బరు చెప్పులతో వచ్చి వేల కోట్ల రూపాయలు సంపాదించలేదని వ్యాఖ్యానించారు. రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వం, దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ పోరంబోకు, అసైన్డ్ భూముల క్రయవిక్రయాలను నిషేధిత జాబితాలో ఉంచుతారు. అయితే రికార్డుల నమోదు లోపాల కారణంగా తెలంగాణలో వేలాది మంది రైతులు, పట్టణ ప్రాంతాల ప్రైవేటు ఆస్తులు కూడా ఈ జాబితాలోకి వెళ్లాయి. దీంతో భూములను విక్రయించలేక, బ్యాంకు రుణాలు పొందలేక యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక కమిటీ సమీక్ష ద్వారా అర్హమైన భూములను జాబితా నుంచి తొలగించి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# గాయత్రి, శ్రీకాంత్‌లకు అర్జున అవార్డులు

- బ్యాడ్మింటన్‌లో గాయత్రి సత్తా
- పారా షూటింగ్‌లో శ్రీకాంత్ మెరుపులు
- మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులు
- అభినందనలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి, క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ క్రీడాకారులు పుల్లెల గాయత్రి గోపీచంద్, ధనుష్ శ్రీకాంత్ ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డులను అందుకున్నారు. బ్యాడ్మింటన్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న గాయత్రి గోపీచంద్, పారా షూటింగ్‌లో అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న ధనుష్ శ్రీకాంత్‌లకు కేంద్ర ప్రభుత్వం అర్జున పురస్కారాలను ప్రకటించింది. వీరిద్దరి విజయాలను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. దేశ, రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ యువ క్రీడాకారులకు వారు స్ఫూర్తిగా నిలుస్తున్నారని ప్రశంసించారు. మహిళల డబుల్స్ బ్యాడ్మింటన్‌లో కేరళకు చెందిన ట్రీసా జాలీతో కలిసి గాయత్రి గోపీచంద్ పలు టైటిళ్లు సాధించారు. ఆమెతో పాటు ట్రీసా జాలీకి కూడా అర్జున అవార్డు లభించింది. అంతర్జాతీయ పారా షూటింగ్‌లో ధనుష్ శ్రీకాంత్ పలు పతకాలు సాధించి దేశానికి గుర్తింపు తీసుకొచ్చారు.

**యువ సంచలనాలకు పురస్కారాలు**

చెస్‌లో యువ సంచలనం దివ్యా దేశ్‌ముఖ్, విదిత్ సంతోష్ గుజరాతీలకు కూడా అర్జున అవార్డులు లభించాయి. అథ్లెటిక్స్‌లో తేజస్విన్ శంకర్, మహ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి, బాక్సింగ్‌లో నరేందర్ బెర్వాల్, హాకీలో లాల్‌రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్, కబడ్డీలో సుర్జీత్, పూజ, పారా అథ్లెటిక్స్‌లో ఏక్తా భ్యాన్, రోయింగ్‌లో అరవింద్ సింగ్, షూటింగ్‌లో అఖిల్ షియోరాన్‌లకు అవార్డులు దక్కాయి. ఈసారి మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు ఈసారి ఎవరినీ ఎంపిక చేయలేదు. కోచ్‌లకు అందించే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురికి లభించాయి. బాక్సింగ్‌లో ఛోటే లాల్ యాదవ్, అథ్లెటిక్స్‌లో పర్వీర్ సింగ్, షూటింగ్‌లో నేహా నందన్‌కుమార్ చవాన్ ఈ పురస్కారాలను అందుకున్నారు. జీవితకాల విభాగంలో బాక్సింగ్‌కు ధర్మేంద్ర సింగ్ యాదవ్, రెజ్లింగ్‌కు వీరేందర్ కుమార్‌కు ద్రోణాచార్య అవార్డులు దక్కాయి. అర్జున అవార్డు జీవితకాల విభాగంలో ఫుట్‌బాల్‌కు అరుమైనాయగంకు పురస్కారం లభించింది. తెలంగాణకు చెందిన గాయత్రి గోపీచంద్, ధనుష్ శ్రీకాంత్‌లకు అర్జున అవార్డులు లభించడం గర్వంగా ఉందని తెలంగాణ క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బ్యాడ్మింటన్, పారా షూటింగ్‌లో అద్భుత ప్రదర్శనతో వారు రాష్ట్రానికి, దేశానికి గుర్తింపు తీసుకొస్తున్నారని అభినందించారు. యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం ప్రకటించిన ఈ క్రీడా పురస్కారాలు 2025 సంవత్సరానికి సంబంధించినవిగా తెలిపారు.

# వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

- రిజర్వేషన్లు మారితే నా సతీమణిని పోటీకి నిలుపుతా
- అధిష్ఠానం ఆదేశిస్తే మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగుతా
- ఏదైనా పార్టీ నిర్ణయమే శిరోధార్యంగా భావిస్తా
- గ్రేటర్‌లో గెలవబోయేది కాంగ్రెస్సే.. 46 నుంచి 48 డివిజన్లు గెలుస్తాం
- పదేళ్లలో పరకాలలో పార్టీని సున్నా నుంచి విజయం వరకు తీసుకొచ్చాం
- ప్రజా, సామాజిక సేవతోలనే నాకు సంతృప్తి
- పార్టీ కార్యకర్తలే నా బలం.. వారే నా సైన్యం
- దసరా నుంచి కొత్త కార్యాచరణ అమలు చేస్తాం
- ఎన్టీఆర్‌కు వీరాభిమానాని..ముందు ఎస్ఎఫ్ఐలో పనిచేశా
- ఈ దేశానికి కాంగ్రెస్ ఎంతో అవసరం..
- డీసీసీ అధ్యక్షుడిగా ఎంపికవ్వడానికి క్లీన్ అండ్ మెరిటే కారణం
- నా విజన్ చూసి.. రాహుల్ గాంధీ హగ్ ఇచ్చారు
- హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి



## కేడర్‌కు పెద్దపీట.. దసరా నుంచి కొత్త కార్యాచరణ

డీసీసీ అధ్యక్షుడిగా అందరినీ కలుపుకొని వెళ్తున్నానని ఇనుగాల తెలిపారు. ఎమ్మెల్యేలు సూచించిన వారితోపాటు క్షేత్రస్థాయిలో పనిచేసే వారికి కమిటీల్లో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తామని, జెన్‌జీతోపాటు జెన్‌ఆల్ఫాను కూడా పార్టీతో అనుసంధానం చేసే ఆలోచన ఉందన్నారు. ఈ నెల 31లోగా కమిటీలను పూర్తి చేస్తామని, ప్రతి 15 రోజులకు ఒకసారి డీసీసీలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. గ్రామస్థాయిలోనే ప్రజా సమస్యలు పరిష్కారం కావాలని అన్నారు. గ్రామ అధ్యక్షుడు తన పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తే ఎమ్మెల్యేలపై ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. కింది స్థాయి నుంచి వచ్చే సూచనలను ఎమ్మెల్యేలు పరిశీలిస్తే పార్టీ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు డిజిటలైజేషన్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి దసరా వరకు శంకుస్థాపన జరిగే అవకాశం ఉందని చెప్పారు. కార్యాలయ నిర్మాణం కోసం ముఖ్య నేతలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. దసరా నుంచి జిల్లాలో కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని, ప్రతి గ్రామంలో జెండా పండుగతోపాటు సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి నెలా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామన్నారు.

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** రెండుసార్లు పార్టీ కోసం పరకాల అసెంబ్లీ ఎన్నికల బరిలో నుంచి తప్పుకున్నా.. ఈసారి మాత్రం ఖచ్చితంగా అధిష్ఠానం తనకు అవకాశం కల్పిస్తుందన్న విశ్వాసం ఉందని హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. డీలిమిటేషన్‌లో రిజర్వేషన్లు మారి తనకు అవకాశం లేకపోతే తన సతీమణిని బరిలోకి దింపుతానని ప్రకటించారు. అధిష్ఠానం ఆదేశిస్తే గ్రేటర్ వరంగల్ మేయర్ అభ్యర్థిగానూ పోటీ చేస్తానని, పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని చెప్పారు. పదవుల కోసం కాకుండా పార్టీ, ప్రజల కోసం పనిచేయడమే తన లక్ష్యమన్నారు. గ్రేటర్ వరంగల్‌లో కాంగ్రెస్ 46 నుంచి 48 డివిజన్లు గెలుచుకునే పరిస్థితి ఉందని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు పరకాలలో పార్టీని సున్నా నుంచి గెలుపు స్థాయికి తీసుకువచ్చామని, పార్టీ కార్యకర్తలే తన బలమని, వారే తన సైన్యమని తెలిపారు. హనుమకొండలోని తన నివాసంలో మంగళవారం డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఇనుగాల తన రాజకీయ ప్రస్థానం, వ్యక్తిగత నేపథ్యం, సేవా కార్యక్రమాలు, పరకాలలో కాంగ్రెస్ బలోపేతం, డీసీసీ అధ్యక్షుడిగా చేపడుతున్న కార్యక్రమాలు, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై మాట్లాడారు.

**ఎన్టీఆర్‌కు వీరాభిమాని.. ఎస్ఎఫ్ఐతో రాజకీయ ప్రస్థానం**

చిన్ననాటి నుంచే తనకు రాజకీయాలపై ఆసక్తి ఉండేదని ఇనుగాల తెలిపారు. ఎన్టీఆర్‌కు వీరాభిమానిగా ఉండేవాడినని, ఆయనను చూసేందుకు స్కూల్ హాస్టల్ కాంపౌండ్ వాల్ దూకి వెళ్లినందుకు టీసీ ఇచ్చిన ఘటనను గుర్తుచేసుకున్నారు. 1985లో ఎస్ఎఫ్ఐలో విద్యార్థి ఉద్యమంతో రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. 2010లో కాంగ్రెస్‌లో చేరి 2012 నుంచి క్రియాశీలంగా పనిచేస్తున్నానని తెలిపారు. తమ కుటుంబానికి మొదటి నుంచీ కాంగ్రెస్‌తో అనుబంధం ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టి.చంద్రశేఖర్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారని చెప్పారు. తమ కుటుంబానికి ఒకప్పుడు నాలుగు వేల ఎకరాల భూమి ఉండేదని, అందులో మొత్తం దానం చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆత్మకూరులో ఇల్లు తప్ప పెద్దగా ఆస్తులు లేవన్నారు. మామునూరు విమానాశ్రయం ఉన్న స్థలం తమ కుటుంబానికి చెందినదేనని, తమ తాతల కాలంలో ఎకరాకు రూపాయి చొప్పున విక్రయించారని వెల్లడించారు.

**డీలిమిటేషన్.. రిజర్వేషన్లు మారితే సతీమణి**


డీలిమిటేషన్ కారణంగా నియోజకవర్గ రిజర్వేషన్లు మారి తనకు పోటీ చేసే అవకాశం లేకపోతే సతీమణిని రాజకీయ బరిలోకి దింపుతానని ఇనుగాల తెలిపారు. పార్టీ నిర్ణయం ఏదైనా తనకు శిరోధార్యమేనన్నారు. అధిష్ఠానం ఎమ్మెల్యేగా పోటీ చేయమంటే ఎమ్మెల్యేగా, మరో బాధ్యత అప్పగిస్తే దానిని స్వీకరించి పనిచేస్తానని చెప్పారు. మేయర్ పదవిపై తనకు ప్రత్యేక ఆసక్తి లేదని, అయితే పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే జీడబ్ల్యూఎంసీ మేయర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. "పదవి ముఖ్యం కాదు.. పార్టీ నిర్ణయమే ముఖ్యం" అని స్పష్టం చేశారు. ఈ దేశానికి కాంగ్రెస్ ఎంతో అవసరమని, పార్టీని బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు.

**48 గంటల దీక్షతో రెవెన్యూ డివిజన్ సాధన**

పరకాల రెవెన్యూ డివిజన్ కోసం గత ప్రభుత్వ హయాంలో అనేక పోరాటాలు చేశానని ఇనుగాల తెలిపారు. 2016లో 48 గంటల నిరాహార దీక్ష చేపట్టడంతో ప్రభుత్వం స్పందించిందన్నారు. టెక్స్‌టైల్ పార్కు కోసం భూములు కోల్పోయిన బాధితులకు మొదట ఎకరాకు రూ.3 లక్షల పరిహారం నిర్ణయించగా, పోరాడి ఎకరాకు రూ.10 లక్షలతోపాటు వంద గజాల స్థలం ఇప్పించేలా కృషి చేశానన్నారు. కుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో సంస్థ బ్రాండ్ ఇమేజ్‌ను మార్చామని, ల్యాండ్ పూలింగ్ పథకాన్ని రాష్ట్రంలో ప్రత్యేకంగా నిలిచేలా చేశామని చెప్పారు. రైతులు స్వచ్ఛందంగా 225 ఎకరాలు ఇచ్చారని, రానున్న రోజుల్లో కుడాకు రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు లాభం వచ్చే అవకాశం ఉందన్నారు.

**'క్లీన్ అండ్ మెరిట్'తో డీసీసీ అధ్యక్ష పదవి**

డీసీసీ అధ్యక్ష పదవి కోసం తాను ఎలాంటి పైరవీలు చేయలేదని ఇనుగాల స్పష్టం చేశారు. ఎన్నో అవకాశాలు, ఆఫర్లు వచ్చినా పార్టీ మారలేదన్నారు. "క్లీన్ అండ్ మెరిట్ వల్లే నాకు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు వచ్చాయి" అని చెప్పారు. పార్టీ మారకుండా కొనసాగిన హార్డ్‌కోర్ కాంగ్రెస్ వాదులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న రాహుల్‌గాంధీ నిర్ణయంలో భాగంగానే తనకు ఈ బాధ్యత దక్కిందన్నారు. తన విజన్ గురించి రాహుల్‌గాంధీకి వివరించినప్పుడు ఆయన తనను హగ్ చేసుకున్నారని చెప్పారు. బీజేపీకి తెరవెనుక ఆర్ఎస్ఎస్ ఎలా పనిచేస్తుందో.. కాంగ్రెస్‌కు కూడా సుశిక్షితమైన కార్యకర్తల సైన్యం ఉండాలని తాను భావిస్తున్నానన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డీసీసీ అధ్యక్షుల సమావేశంలో రాహుల్‌గాంధీ సమక్షంలోనే ఈ అంశాన్ని ప్రస్తావించానన్నారు. హనుమకొండ జిల్లాలో 500 మంది కార్యకర్తలను సైనికులుగా తీర్చిదిద్దుతున్నామని, ఎన్నికలు ఎక్కడ జరిగినా అక్కడికి వెళ్లి పార్టీ తరఫున ప్రచారం చేసేలా వారిని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. "కార్యకర్తలే నా బలం.. వారే నా సైన్యం" అని అన్నారు.



## పరకాలలో పదేళ్ల పోరాటం.. సున్నా నుంచి విజయానికి

పరకాలలో కాంగ్రెస్‌ను సున్నా నుంచి గెలుపు స్థాయికి తీసుకురావడమే తన రాజకీయ ప్రస్థానంలో కీలక ఘట్టమని ఇనుగాల చెప్పారు. 2014లో తొలిసారి పరకాల నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశానని, ఆ సమయంలో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉండటంతో ఎన్నికలు త్రిముఖ పోరుగా సాగాయని గుర్తుచేశారు. ఓటమి ఎదురైనా వెనుకడుగు వేయకుండా పార్టీని బలోపేతం చేశానన్నారు. కొండా సురేఖ పార్టీ మారిన తర్వాత పరకాల బాధ్యతలు తనకు అప్పగించారని, ఆ తర్వాత దాదాపు పదేళ్లపాటు కార్యకర్తలకు అండగా నిలిచి గ్రామగ్రామాన తిరిగానని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించామని, ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు వచ్చిన సుమారు ఐదు వేల ఓట్ల నుంచి 2023లో పార్టీ గెలిచే స్థాయికి తీసుకువచ్చామని చెప్పారు. 2018, 2023 ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేయాలని ఆశించినప్పటికీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి రెండుసార్లు అభ్యర్థిత్వం నుంచి తప్పుకున్నానన్నారు. పార్టీ కోసం విధేయుడిగా ఉన్నందుకే ఈసారి అవకాశం వస్తుందన్న నమ్మకం ఉందని చెప్పారు. "రెండుసార్లు వద్దన్న పార్టీ.. మూడోసారి కూడా వద్దనదనే నమ్మకం ఉంది. ఈసారి పరకాల నుంచి నా పేరు కచ్చితంగా ఉంటుంది" అని స్పష్టం చేశారు. టికెట్లు ఇచ్చే అంశాలు వాస్తవానికి అప్పటి పరిస్థితులు, సమీకరణాలపైనే ఆధారపడుతాయని అన్నారు. కాంగ్రెస్‌లో టికెట్లను డిసైడ్ చేసేది అధిష్ఠానమేనని అన్నారు.

**గ్రేటర్‌లో కాంగ్రెస్‌దే పాగా.. 46 నుంచి 48 డివిజన్లు**

గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్‌దే పాగా అని ఇనుగాల ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నిర్వహించిన సర్వే ప్రకారం ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 66 డివిజన్లలో 46 నుంచి 48 డివిజన్లు కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతోపాటు ఇతర అభివృద్ధి పనులు ప్రారంభమైతే పార్టీ బలం మరింత పెరుగుతుందన్నారు. త్వరలో డివిజన్, బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తామని, 13 మండలాల అధ్యక్షులను రంగంలోకి దింపుతామని తెలిపారు. ప్రతి వంద మంది ఓటర్లకు ఒక కార్యకర్తను నియమించే వ్యూహంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

**సీఎం సభకు ఎందుకు వెళ్లలేదంటే..**

పరకాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న సభకు తాను హాజరుకాకపోవడంపై కూడా ఇనుగాల వివరణ ఇచ్చారు. అది కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం కాదని, ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రభుత్వ అధికారిక కార్యక్రమమని చెప్పారు. అందువల్ల తనకు ప్రొటోకాల్ లేదని, ఆ కారణంగానే సభకు హాజరుకాలేదని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి రాజకీయ కారణాలు లేవన్నారు. ఎన్నికల్లో గెలవాల్సింది వ్యక్తి కాదని.. పార్టీనే అన్న రాహుల్‌గాంధీ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేస్తామని చెప్పారు. పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తూ ముందుకు సాగుతానని, అధిష్ఠానం అప్పగించే ప్రతి బాధ్యతను శిరసావహిస్తానని ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు.

## ప్రజాసేవలోనే సంతృప్తి.. ట్రస్ట్ ద్వారా సేవలు

రాజకీయ పదవుల కంటే ప్రజా, సామాజిక సేవ ద్వారానే తనకు ఎక్కువ సంతృప్తి లభిస్తుందని ఇనుగాల తెలిపారు. ఇనుగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు సాయం చేయడం ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. ప్రాణాలు కాపాడడంలో ఉండే ఆనందం మరేదాంట్లో ఉండదని చెప్పారు. ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలకు ఉపయోగిస్తున్న ప్రతి రూపాయి తమ కుటుంబ కష్టార్జితమేనని తెలిపారు. కుడా చైర్మన్‌గా రెండేళ్లు పనిచేసిన సమయంలో వచ్చిన జీతాన్ని కూడా పేదల సహాయానికే ఖర్చు చేశానన్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వైద్య విభాగంలో సౌకర్యాల కొరత గుర్తించి కోటి రూపాయలు అందించానని చెప్పారు. పరకాల ప్రభుత్వ ఆస్పత్రికి రూ.50 లక్షలు ఇస్తానని చెప్పానని, పీడియాట్రిషియన్ అందుబాటులో లేకపోతే డయాలసిస్ విభాగం ఏర్పాటుకు కూడా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. పార్టీ కార్యకర్తలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని, అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందిస్తానని తెలిపారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266